## రూ.50వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమిని సంరక్షించాం

నగరంలో ఇప్పటి వరకు మొత్తం 923 ఎకరాలను సంరక్షించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దాదాపు రూ.50వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించామన్నారు. నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయని.. నగరంలో ఆరు చెరువులను పూర్తిగా పునరుజ్జీవం చేశామన్నారు. నిన్న గాజులరామారంలోని ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలనే తొలగించామని.. గాజులరామారంలోని నకిలీ పట్టాలు తీసుకొని నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రభుత్వ భూమిలోని 260 నిర్మాణాలను మాత్రమే తొలగించామన్నారు. గాజులరామారంలోని కొందరు రౌడీషీటర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తెలిపారు.ప్రస్తుతం 51 డీఆర్‌ఎఫ్ బృందాలు ఉన్నాయి.. త్వరలోనే 72కి పెంచుతామన్నారు. నగరంలో 150 మాన్‌సూర్ ఎమర్జెన్సీ టీమ్స్ ఉన్నాయని.. ఆక్రమణలకు గురైన నాలాలు గుర్తించి ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. నాలాల్లో పూడిక తొలగింపును ముమ్మరం చేశామని.. వర్షం నీరు చెరువుల్లోకి వెళ్లే పరిస్థితి, నీరు నిల్వ చేసే పరిస్థితి లేదన్నారు. కాంక్రీటైజేషన్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదని..



# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :181 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 23-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణ సాధనలో సింగరేణిది ప్రత్యేక పాత్ర





హైదరాబాద్,సెప్టెంబర్22: తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు ప్రత్యేక పాత్ర పోషించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఎప్పటికి గుర్తుంచు కుంటుందని అన్నారు. సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది సర్కార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూతపడుతుందన్న దశలో సింగరేణిని కాకా వెంకటస్వామి ఆదుకున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో బొగ్గు ఉత్పత్తి మొత్తని స్తంభింపచేసి అప్పటి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చినట్లు గుర్తు చేశారు. దేశంలో వెలుగులు విరాజిల్లుతున్నాయంటే.. సింగరేణి కార్మికులు ఉత్పత్తి చేసిన బొగ్గు కారణమని అన్నారు సీఎం రేవంత్. నిరంతరం కష్టపడి రాష్ట్ర ఆదాయంలో, దేశ ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను సంస్థకు వచ్చిన లాభాల్లో భాగస్వామ్యం చేస్తోందని అన్నారు. ఒకప్పుడు సింగరేణి సంస్థ నష్టాల్లో కూరుకుపోయి మూతపడే దశలో ఉన్నప్పుడు కాకా వెంకటస్వామి కేంద్రంతో మాట్లాడి సంస్థను ఆదుకున్నారని అన్నారు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడకుండా లాభాల్లో నడుస్తుందని అన్నారు సీఎం రేవంత్.ఇప్పుడు సంస్థకు వచ్చిన లాభాల్లో కార్మికులకు వాటా ఇస్తూనే.. కార్మికుల భవిష్యత్తు కోసం చర్యలు చేపట్టామని అన్నారు. కార్మికులకు పండగ బోనస్ తో పాటు- భవిష్యత్ పెట్టు-బడుల కోసం కూడా నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా పండగ బోనస్ ఇస్తున్నామని తెలిపారు సీఎం రేవంత్. సింగరేణి సంస్థ కార్పొరేట్ సంస్థలతో పోటీ పడి ఎదగాలని ఆకాంక్షించారు సీఎం రేవంత్.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

న్యూఢిల్లీ,సెప్టెంబర్22, అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పైలట్ల పనితీరులో లోపాలు ఉన్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ నివేదికపై ఊహాజనిత కథనాలు దురదృష్టకరమని, అది బాధ్యతారాహిత్యమేనని పేర్కొంది. ఈ ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కు నోటీసులు ఇచ్చింది. జూన్ నెలలో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు- ఏఏఐబీ నివేదికను సమర్పించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు- ఆ నివేదికలో వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని.. ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదికను విడుదల చేస్తామని తెలిపింది. ఆ తర్వాత అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఎయిరిండియా విమానం పైలటే ఇంధన స్విచ్‌ను షట్‌డౌన్ చేశారంటూ ఊహాజనిత వార్తలు ప్రచురించాయి. దర్యాప్తు కొనసాగుతోన్న దశలో ఇటు-



వంటి చర్యలు బాధ్యతారాహిత్యంతో కూడినవని అప్పట్లో ఏఏఐబీ ఖండించింది. ఈనేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు కోసం పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. అసలు ఏం జరిగిందో గుర్తించేందుకు ÷–లఫైట్ డేటా రికార్డర్‌ను పరిశీలించేందుకు నిపుణులను అనుమతించాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందించింది.న్యాయపరమైన, నిష్పాక్షిక దర్యాప్తు వరకు చూసుకుంటే అది ముఖ్యమే. కానీ ఆ వివరాలన్నీ బహిర్గతం చేస్తే.. పాడ్‌కాస్టుల్లో కొత్త సిద్ధాంతాలు అల్లేస్తారు. ఎవరైనా బాధ్యతారహితంగా పైలట్ ది తప్పు అని చెప్తే.. అది ఆ కుటుంబంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఒకవేళ.. తుది నివేదికలో ఆ పైలట్ పేరు లేకపోతే.. అప్పుడు ఏం చేస్తాం అని ప్రశ్నించింది.

## నేడు మేడారం సందర్శనకు సిఎం రాక

ములుగు,సెప్టెంబర్22: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మేడారం సందర్శించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పి షబరిష్ లతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో పర్యాటక పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, దిశా నిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఎ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ- చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ డిఒ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఇఒ వీరస్వామి, ఎ పి ఓ వసంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సిఎం రేవంత్ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు- చేస్తున్నారు. మేడారం మహాజాతరకు సంబంధించిన పనులకు శంకుస్థాపన, గద్దెల మార్పుపై ఫైనల్ డిజైన్ విడుదల వంటి కీలక కార్యక్రమాలు ఈ సందర్శనలో భాగంగా ఉన్నాయి. మంత్రి సీతక్క ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటు-పాట్లు- లేకుండా చూడాలని, ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటన సజావుగా సాగేలా భద్రత, రవాణా, ఇతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకోనున్నారు.



ఆయన తొలుత సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని, ఆ తర్వాత మేడారం మహాజాతరకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే సమయంలో, గద్దెల మార్పుకు సంబంధించిన ఫైనల్ డిజైన్‌ను కూడా విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమం మేడారం జాతరకు కొత్త ఒరవడిని అందించనుంది. మేడారం జాతర తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుంది. సీఎం పర్యటన ఈ ప్రాంతంలో అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ సంరక్షణకు ఊతమిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాలు రాష్ట్రంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్శన రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మేడారం జాతర భక్తులకు కీలకంగా మారనుంది.

## కాంగ్రెస్‌ను నమ్మినందుకు నిండా మునిగారు



హైదరాబాద్,సెప్టెంబర్22, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పేదలు కట్టుకున్న గూళ్లను కూల్చేస్తే వారు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. తాజా కూల్చివేతలపై ఆయన మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెలవు రోజుల్లో కూల్చివేతలు వద్దని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కానీ ఆదివారం సెలవురోజునే గాజులరామారంలో పేదల ఇళ్లు కూల్చారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు- వేస్తే.. బుల్డోజర్ రాజ్యానికి లైసెన్స్ ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుందని.. పెద్దల ఇళ్లకు వెళ్లదన్నారు. భారత రాష్ట్ర సమితి కార్యకర్త సర్దార్ ఇంటిని ప్రభుత్వం కూల్చివేసింది. ఆయనకు మళ్లీ ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాది. నిన్న మోదీ హెచ్1 బీ వీసా గురించి మాట్లాడతారని ఆశించాం. దాని గురించి మాట్లాడకుండా జీఎస్టీ పండగ అని చెప్పారు. నిన్నటి వరకు రక్తం తాగి.. ఇప్పుడు పండగ చేసుకో అంటు-న్నారు. జీఎస్టీ పేరు మీద 8 ఏళ్ల పాటు- ప్రజల నుంచి ఎంతో భారం వేశారు. మోదీ గతంలో చెప్పినట్లు- ప్రజలందరికీ రూ.15 లక్షలు ఇస్తే పండగ చేసుకుంటామని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## పెద్దోళ్లను వదిలి పేదలపై ప్రతాపమా?

హైదరాబాద్ : ప్రభుత్వ భూములు ఆక్రమించారంటూ కూల్చివేతలు చేపడుతున్న హైడ్రా పెద్దోళ్లను వదిలి పేదలపై ప్రతాపం చూపడం ఏమిటని..కోర్టు చెప్పినా సరే ఆదివారం ఇళ్లు కూల్చుతారా? అని బీఆర్‌ఎస్ బహిష్కృత ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. పేదల ఉసురు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం గాలిపోచమ్మ బస్తీలో హైడ్రా కూల్చివేతల బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ హైడ్రా కూల్చేవేత బాధితులైన పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రూ. 50 వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. మళ్లీ హైడ్రా బుల్డోజర్ వస్తే నేనే అడ్డుగా నిలుచుంటానన్నారు. ముందు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాలలో కబ్జాలు తొలగించాలని డిమాండ్ చేశారు. కూలీ చేసుకొనే వాళ్ల ఇళ్లను కూల్చేస్తూ హీరోయిజం చూపిస్తున్నారా? అని మండిపడ్డారు. వెంచర్లు చేసి అమ్మటంతో చాలా మంది లక్షలు పెట్టి కొనుక్కున్నారని, వాళ్లకు ప్రభుత్వం డబ్బులు తిరిగి చెల్లించాలని, ఎకరాల కొద్దీ పెద్దవాళ్లు చేసిన కబ్జాలు ప్రభుత్వానికి కనబడటం లేదా? అని..ముందు వాటిని కూలగొట్టండని కవిత డిమాండ్ చేశారు. పేదవాళ్ల భూములు మాత్రమే ప్రభుత్వానికి కనబడుతున్నాయా? అని నిలదీశారు. పేదలకు అన్యాయం చేస్తే ప్రభుత్వానికి ఉసురు తాకుందన్నారు.

### సెలవు దినాల్లో కూల్చివేతలతో కోర్టు ధిక్కారం

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి వైఎస్ ప్రభుత్వంలో భూములు ఇచ్చారని..ఆనాడే కంచె వేసి ఉంటే ఈ భూములు కబ్జా అయ్యేవి కాదు అని కవిత పేర్కొన్నారు. పోచమ్మ బస్తీ చుట్టు పక్కల ఉన్న దాదాపు 4 వందల ఎకరాల్లో కబ్జాలు జరిగాయని, చాలా ప్రభుత్వాలు మారినప్పటికీ భూముల రక్షణను పట్టించుకోలేదు అన్నారు.ఇప్పుడు హైడ్రా హడావుడిగా వచ్చి పెద్ద వాళ్ల జోలికి పోకుండా%ె%పేదల ఇళ్లను రాత్రికి రాత్రికి కూలగొట్టటం దారుణం అని కవిత తప్పుబట్టారు. చిన్న పిల్లలను.. మరోపక్క పండుగ ఉండగా.. ఈ సమయంలో వారి ఇళ్లు కూలగొట్టటం అమానుషం అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రాకు గతంలోనే కోర్టు శని, ఆదివారాలు ఎవరి జోలికి వెళ్లవద్దని స్పష్టంగా చెప్పింది అని, వాళ్లకు న్యాయం కోసం కోర్టుకు



వచ్చే అవకాశం ఇవ్వాలని కోరింది అని కవిత తెలిపారు. అయినప్పటికీ ఆదివారం రోజు ఇళ్లను కూలగొట్టి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారన్నారు. గ్యాస్ బిల్లు, కరెంట్ బిల్లు ఉన్న వాళ్ల ఇళ్లను కూడా కూలగొట్టారని.. పిల్లలు, ముసలి వాళ్లు ఉన్న కూడా పట్టించుకోలేదన్నారు. పైగా నోటీసులు ఇచ్చామంటూ అబద్దాలు చెబుతున్నారని కవిత మండిపడ్డారు. పండుగ పూట పేదల ఉసురు తీసుకోకండని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నానన్నారు.

### ప్రజలకు అందుబాటులో ఉండని సీఎం

మళ్లీ ఈ నెల 6 లోపు హైడ్రా వాళ్లు వస్తామని చెప్పారని..ఆ లోపు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఇక్కడ మొత్తంగా 200 లోపు కుటుంబాలు మాత్రమే ఉన్నాయని. వారందరికీ డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని కోరారు. 6 వ తేదీ లోపు బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లేదంటే హైడ్రా బుల్డోజర్ కు అడ్డంగా నేను నిలుచుంటానన్నారు. బాధితులతో కలిసి వారి వివరాలు తీసుకొని నేనే వస్తానని.. ఎక్కడకి రమ్మంటారో చెప్పండి అని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే మున్సిపల్ మంత్రిగా ఉండి గడీలో ఉంటున్నాడని..ఆఫీస్ కు, సెక్రటేరియేట్ కు రావడం లేదని..ప్రజలు ఎక్కడ తమ బాధలు చెప్పుకోవాలి అని కవిత ప్రశ్నించారు. ప్రజా పాలన పేరుతో సమస్యలు చెప్పుకోవాలని అంటున్నారని..రెండేళ్లలో ముఖ్యమంత్రి ఒక్కసారి మాత్రమే ప్రజాపాలన వద్దకు వచ్చాడని కవిత గుర్తు చేశారు.

## లగ్జరీ కార్ల స్కామ్ లో కేటీఆర్..విచారణకు బండి సంజయ్ డిమాండ్



హైదరాబాద్ : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లగ్జరీ కార్ల స్కామ్ నిందితుడు బసరత్ ఖాన్ తో ఉన్న సంబంధంపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. బసరత్ ఖాన్ అక్రమంగా దిగుమతి చేసిన ల్యాండ్ క్రూజర్ కార్లలో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నాడు? బీఆర్ ఎస్ పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తుందా? అని ప్రశ్నించారు. ఆ కార్లు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీల పేర్లతో ఎందుకు రిజిస్టర్ అయ్యాయి?..వాటికి మార్కెట్ ధర చెల్లించారా? లేక తక్కువగా చూపించి కొనుగోలు జరిగిందా? అని దర్యాప్తు సంస్థలు విచారించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కార్లకు చెల్లింపులు బినామీ పేర్లతోనా? నకిలీ ఆదాయమా? లేక మనీలాండరింగ్ ద్వారా జరిగిందా? అన్నది విచారణలో తేల్చాలన్నారు. ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందిందని ? వాస్తవాలు బయటకు రావాలంటే సంబంధిత శాఖలు విచారణ చేపట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

### ల్యాండ్ క్రూజర్ కార్ల స్మగ్లర్ తో కేటీఆర్ లింకులు?

ల్యాండ్ క్రూజర్ కార్లు స్మగ్లర్ బసరత్ ఖాన్ తో కేటీఆర్ కు లింకులు ఉన్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే ఆయన ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ల్యాండ్ క్రూజర్ కార్ల స్కామ్ లో ఆయన ప్రమేయంపై ఆరోపణలు చోటుచేసుకున్నాయి. బసరత్ ఖాన్ స్మగ్లింగ్ చేసిన ల్యాండ్ క్రూజర్ వాహనం కేటీఆర్ వాడుతుండటం ఇప్పుడు వివాదస్పదమైంది. ల్యాండ్ క్రూజర్ వాహనాల స్మగ్లింగ్ కేసులో మొత్తం 8 వాహనాలను స్మగ్లింగ్ చేసినట్లు నిందితుడు బసరత్ ఖాన్ డీఆర్ఐ అధికారుల విచారణలో ఒప్పుకున్నాడు. తాను స్మగ్లింగ్ చేసిన 8 ల్యాండ్ క్రూజర్ల వాహనాల నెంబర్ల వివరాలతో అధికారుల ముందు వాంగ్మూలం ఇచ్చాడు. ఆ వాహనాల్లో కేటీఆర్ వాడుతున్న వెహికల్ (టీఎస్09డి 6666) కూడా ఉన్నట్లు బసరత్ ఖాన్ అంగీకరించాడు. కేటీఆర్ వాడే వాహనం ఎట్ హోం హాస్పిటాలిటీ సర్వీస్ పేరుతో రిజిస్టర్ అయినట్లుగా డీఆర్ఐ అధికారులు గుర్తించారు. దీంతో ఎట్ హోం కంపెనీకి..నిందితుడికి ఉన్న సంబంధాలపై డీఆర్ఐ అధికారులు ఫోకస్ పెట్టారు. అలాగే కేటీఆర్ కుటుంబానికి, ఎట్ హోం కు మధ్య ఉన్న లింక్ పై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

## గడ్డపారతో కొట్టి అన్నను చంపిన తమ్ముడు..

ములుగు:ములుగు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అన్న మాధవరావు పాలిట కాలయముడయ్యాడు తమ్ముడు సాంబశివరావు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి గ్రామంలో మాధవరావుని గడ్డపారతో కొట్టి చంపాడు తమ్ముడు సాంబశివరావు..అన్నదమ్ములిద్దరు ఘర్షన పడ్డారు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన తమ్ముడు అన్నను గడ్డపారతో కొట్టి చంపాడు. అయితే వీరిద్దరి మధ్య గొడవలకు కారణం ఆస్తి తగాదాలే అని స్థానికులు చెబుతున్నారు.మాధవరావు మృతితో చిరుతపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. వెంటరాని ఆస్తుల కోసం గొడవపడి



రక్తం పంచుకు పుట్టిన అన్నదమ్ములు అక్కా చెల్లెళ్లు కొట్టుకు చావడం పై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆటంకంగా మారిన అమెరికా విధానాలు...

సిద్దిపేట,సెప్టెంబర్22, హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కుటుంబ సమేతంగా అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది అని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా దేశానికి సంబంధించిన నియమ నిబంధనలు మనవాళ్లు చదువుకోవడానికి ఉద్యోగాలు చేయడానికి ఆటంకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక, మన దేశానికి సంబంధించి 100 మంది సీఈఓలు ఇతర దేశాల్లో ఉన్నారు అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వారి తెలివి తేటలను మన దేశంలో పెట్టాలని కోరుతున్నాను.. ఇక్కడి ప్రభుత్వాలు రెడ్ కార్పెట్ వేసి కంపెనీలకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక, విదేశాల్లో ఉన్న తెలంగాణ వారంతా తెలంగాణలో పెట్టు-బడులు పెట్టాలి అని కోరారు. గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామికంగా సాంకేతికంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని పొన్నం ప్రభాకర్ చెప్పారు.

## సంపాదకీయం

**మంగళవారం 23-09-2025**

## ఎన్నటికి తీరేనో జెట్ ఇంజిన్ కల

భారత్ చందమామపై వ్యోమనౌకను దింపింది. అంగారక కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపింది. స్వశక్తితో ఖండాంతర క్షిపణులను రూపొందించింది. అణ్వస్త్ర సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ యుద్ధవిమానాన్నీ డిజైన్ చేసింది. అయినా.. యుద్ధవిమానానికి గుండెకాయలాంటి జెట్ ఇంజిన్ మాత్రం కొరుకుడు పడటంలేదు. స్వదేశీ జెట్ ఇంజిన్ కోసం ప్రధాని మోదీ సైతం ఇటీవల ఆకాంక్షించారు. ఈ క్రమంలో విదేశీ భాగస్వామ్యంతో దాన్ని దేశీయంగా అభివృద్ధి చేయనున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించడం హర్షణీయం! రోదసిలోకి వెళ్లే రాకెట్లను అభివృద్ధి చేస్తున్న భారత్– జెట్ ఇంజిన్ల రూపకల్పనలో వెనకబడటానికి కారణాలెన్నో ఉన్నాయి. రాకెట్లు ఒక్కసారే ప్రజ్వరిల్లి, నింగిలోకి వెళ్తాయి. ఆ తరవాత వాటితో పని ఉండదు. జెట్ ఇంజిన్లు వేలసార్లు ప్రజ్వరిల్లాలి. భిన్న వాతావరణాలను తట్టుకోవాలి. ఇందులోని టర్బైన్ రెక్కలు నిమిషానికి దాదాపు 15వేల సార్లు తిరుగుతాయి. 1,700 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత జనిస్తుంది. ఇంత వేడికి చేరేలోపే అనేక లోహాలు కరిగిపోతాయి. ఈ ప్రతికూల పరిస్థితులను తట్టుకునే ప్రత్యేక మిశ్రమ లోహాలు అవసరం. ఎంతో శ్రమకోర్చి రూపొందించే జెట్ ఇంజిన్‌ను విస్తృతంగా పరీక్షించాల్సి ఉంటుంది. పరీక్షల్లో వచ్చిన డేటా ఆధారంగా ఇంజిన్లలో మార్పులు చేర్పులు చేయాల్సి వస్తుంది. ఇన్ని సంక్లిష్టతల వల్ల వాణిజ్య, సైనిక జెట్ ఇంజిన్ల డిజైన్, అభివృద్ధి, పరీక్ష ల నిర్వహణ, ఉత్పత్తి, నిర్వహణ సామర్థ్యం కొన్ని దేశాలకే సొంతమైంది. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్(జీఈ), హనీవెల్, ప్రాట్ అండ్ విట్నీ, బ్రిటన్ సంస్థ రోల్స్ రాయిస్, ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్, రష్యా సంస్థ యునైటెడ్ ఇంజిన్ కార్పొరేషన్‌లకు ఈ రంగంలో పూర్తిస్థాయి సామర్థ్యం ఉంది. చైనా ఇప్పుడిప్పుడే సొంత జెట్ ఇంజిన్ తయారీ సామర్థ్యాన్ని సాధిస్తోంది.

కావేరి కథ సాగిందిలా...

భారత్ 1980లలో దేశీయంగా తేలికపాటి యుద్ధవిమానాన్ని (ఎల్‌సీఏ–తేజస్) రూపొందించాలనుకుంది. దానికి 'కావేరి' పేరుతో ఒక ఇంజిన్‌ను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. డీఆర్‌డీవోకు చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(జీటీఆర్‌ఈ)కు బాధ్యతలు అప్పగించింది. ఈ ప్రాజెక్టుకు రూ.382 కోట్లు ఖర్చవుతాయని 1986లో అంచనా వేశారు. అది క్రమంగా పెరుగుతూ దాదాపు రూ.3వేల కోట్లకు చేరింది. అయినా తేజస్‌కు అవసరమైన ఇంజిన్ సిద్ధం కాలేదు. కావేరి ఇంజిన్ 81 కిలోన్యూటన్ (కేఎన్) శక్తిని ఉత్పత్తి చేయాలి. వెయ్యి కిలోల బరువుండాలి. అయితే 70 కేఎన్ శక్తిని మాత్రమే అందించింది. బరువు 1,235 కిలోలకు పెరిగింది. స్థిరంగా పనిచేయడంలో, శబ్దం వంటి అంశాల్లో సమస్యలు తలెత్తాయి. దీంతో జీఈ సంస్థ నుంచి ఇంజిన్లను దిగుమతి చేసుకోవాలని, కావేరి సిద్ధమయ్యాక అమర్చవచ్చని నిర్ణయించారు. చివరికి కావేరిని మెరుగుపరచడం కష్టమని తేల్చి, పక్కనపెట్టాల్సి వచ్చింది. భవిష్యత్‌లో రూపొందించే మానవరహిత పోరాట విమానాలకు వాటిని వాడాలని, తేజస్‌కు పూర్తిగా విదేశీ ఇంజిన్లే కొనసాగించాలని నిర్ణయించారు. సాంకేతిక అవరోధాలకు తోడు నిధుల సమస్య, ప్రభుత్వ ప్రాథమ్యాలు మారడం వంటివీ కావేరికి శరాఘాతాలయ్యాయి. పటిష్ఠ మిశ్రమ లోహాలు, పదార్థాలపై మన సంస్థలకు అంతగా పట్టులేదు. ఇంజిన్లను పరీక్షించే కీలక మౌలిక వసతులూ లేవు. రష్యాపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఫలితంగా ఖర్చులు, జాప్యం పెరిగిపోయాయి. 1998లో అణు పరీక్షల తరవాత ఆంక్షలవల్ల విదేశీ సాంకేతిక సాయం పొందడం కష్టమైంది. ఆంక్షలు తొలగిపోయేనాటికి ఆలస్యమైంది. తరచూ డిజైన్‌ను మార్చడం కూడా సమస్యగా మారింది. వైమానిక దళం మార్పులను కోరడం, వాటిని సర్దుబాటు చేయాల్సి రావడంతో పరిస్థితి సంక్లిష్టంగా మారింది. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఆమ్కా) పేరుతో అయిదో తరం స్టెల్త్ యుద్ధవిమాన రూపకల్పనకు భారత్ నడుం బిగించింది. దీనికి మరింత శక్తిమంతమైన 120 కేఎన్ ఇంజిన్ అవసరం.

భాగస్వామ్యంతో ముందుకు...

మొత్తానికి సొంతంగా జెట్ ఇంజిన్ల తయారీలో ఇబ్బందులు ఉండటంతో అంతర్జాతీయ భాగస్వామ్యంతోనే ముందుకెళ్లాలని ఇండియా నిర్ణయించింది. శాఫ్రాన్ సంస్థ సాయంతో దేశంలో 120 కేఎన్ సామర్థ్యం ఉన్న జెట్ ఇంజిన్లను అభివృద్ధి చేయడానికి భారత్ సిద్ధమవుతున్నట్లు రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. ఈ ఒప్పందం కింద శాఫ్రాన్ సంస్థ వంద శాతం సాంకేతిక పరిజ్ఞానాన్ని డీఆర్‌డీవోకు బదిలీ చేయనుందని వార్తలు వస్తున్నాయి. తేజస్ యుద్ధవిమానాల కోసం జీఈ–414 ఇంజిన్లను భారత్‌లో ఉత్పత్తి చేసేందుకు జీఈతో చర్చలు జరుగుతున్నాయి. దీనికింద ఆ సంస్థ 70 శాతం సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయాలి. అయితే, జెట్ ఇంజిన్ పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో పంచుకోవడానికి తయారీ దేశాలు ఇష్టపడవు. శాఫ్రాన్, జీఈలు కీలక పరిజ్ఞానాలను పూర్తిగా ఇస్తాయా, విడిభాగాలే సరఫరా చేస్తాయా అనేది తేలాలి. లక్ష్యాన్ని అందుకోవడంలో కావేరి ఇంజిన్ విఫలమైనా, ఆ ప్రాజెక్టు పూర్తిగా నిష్ఫలం కాదని నిపుణులు చెబుతున్నారు. దానివల్ల దేశంలో జెట్ ఇంజిన్ రూపకల్పనకు అవసరమైన వ్యవస్థలు సిద్ధమయ్యాయి. ఇప్పుడు విదేశీ సంస్థల తోడ్పాటుతో జెట్ ఇంజిన్ పరిజ్ఞానంపై మరింతగా పట్టు సాధించవచ్చు. దీన్ని అందిపుచ్చుకుని తదుపరి తరం సాంకేతికతను సొంతంగానే అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలి. తీవ్ర ఉష్ణోగ్రతను తట్టుకునే శక్తిమంతమైన మిశ్రమలోహాలు, టర్బైన్ రెక్కలకు వేసే ప్రత్యేక పూత వంటి పరిజ్ఞానాలపై దేశంలో విస్తృత పరిశోధనలు అవసరం. ఇందుకోసం మెటలర్జీ వంటి కోర్ ఇంజినీరింగ్ సబ్జెక్టులవైపు ప్రతిభావంతులైన విద్యార్థులను ఆకర్షించాలి. రాజకీయ నిబద్ధత కూడా అవసరం. విధానాలు సుస్థిరంగా కొనసాగాలి. నిధుల కొరత రాకూడదు. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లతో ఒక జాతీయ మిషన్‌ను చేపడితే భవిష్యత్‌లోనైనా జెట్ ఇంజిన్ల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుంది. దేశీయ ఇంజిన్‌తో భారత యుద్ధవిమానం నింగిలోకి లేచిన రోజు మన రక్షణ సామర్థ్యంలో కొత్త శకం ప్రారంభమైనట్లే. అది దేశ రక్షణ సార్వభౌమత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది.

# అక్కడి జంగ్ సైరన్ ఇక్కడా మోగుతుందా?



న్యూఢిల్లీ,లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని రక్షించుకోవడంకోసం దేశంలోని విద్యార్థులు, యువజనులు, జెన్ జెడ్ పౌరులు సంసిద్ధులు కావాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి, ఓటు చోరీని అడ్డుకోవడానికి ముందుకొచ్చి ఈ వర్గాలు చేసే పోరాటానికి తాను సర్వదా అండగా నిలబడతానని తాజాగా గురువారం నాడు ఎక్స్ లో ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ మీద పెద్ద దుమారమే చెలరేగుతున్నది. ఇవాళ భారతదేశం లోపలా వెలుపలా జెన్ జెడ్ అనే మాట వింటేనే చాలామంది కంపరం ఎత్తిపోతున్నారు. వారికి భోజనం సహించడం లేదు. రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు. దీనికి కారణం తాజాగా పొరుగు దేశం నేపాల్‌లో జెన్ జెడ్ పౌరులు జరిపిన ఆందోళన లేదా ఉద్యమం, ఆ ఉద్యమం కారణంగా అక్కడి ప్రభుత్వం కుప్ప కూలడం.అసలు జెన్ జెడ్ అంటే ఏమిటి? 1997 2010 సంవత్సరాల మధ్య పుట్టినవారిని జెన్ జెడ్ అని సంబోధిస్తారు. అదంతా యువతరం. ఈ తరం వాళ్లంతా అపారమైన సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలతో పరిచయం కలిగి ఉంటారు. ఈ వయసువారికి ఆ కారణంచేత ప్రపంచ జ్ఞానం చాల ఎక్కువ ఉంటుంది. భూగోళంలో ఏ మూల ఏం జరిగినా క్షణాల మీద వారి దృష్టిలో పడుతుంది. సాధారణంగా పౌరులకు ఇటువంటి ఎరుక ఉండడం ఏలికలకు నచ్చదు. జ్ఞానం ఎక్కువైన కొద్దీ ప్రశ్నించే తత్వం అలవడుతుంది. దానితోపాటు ధిక్కారస్వరం కూడా బలపడుతుంది. కాబట్టి ఈ జెన్ జెడ్ అంటే పాలకవర్గాలకు కంపరం.రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీ స్వతంత్రం వచ్చిన నాటినుండి భారతదేశంలో ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కాబట్టి ఆయనను కూడా పాలకవర్గం ప్రతినిధి లెక్కలో వేసుకోవాల్సిందే. అయితే రాహుల్ గాంధీ ఇప్పుడు జెన్ జెడ్ వర్గంలోని పౌరులకు ఈ పిలుపు ఇవ్వడానికి కారణం ఏమిటి? తన పార్టీని లేదా తన పార్టీ నేతృత్వం వహిస్తున్న కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో బయటపడుతున్న అరాచక స్థితి, ముఖ్యంగా దేశ ప్రజాస్వామ్యానికి మూలమయిన ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు, రాజ్యాంగ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కోల్పోవడం కారణం.రాహుల్ గాంధీ ఈ పిలుపు ఇచ్చిన వెంటనే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమికి నాయకత్వం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ 'రాజ్యాంగ సంస్థలపై రాహుల్ కు విశ్వాసం లేదు' అనేశారు. ఏ రాజ్యాంగ సంస్థల గురించి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతున్నారంటే కేంద్ర ఎన్నికల సంఘాన్ని దృష్టిలో పెట్టుకొనే. రాహుల్ గాంధీ జెన్ జెడ్ పౌరులను ఉద్యమోన్ముఖులు కండి అని పిలుపు ఇచ్చింది కూడా ఈ కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న లేదా ఆ సంఘం నిర్వ్యాపకత్వం కారణంగా జరుగుతున్న ఓటు చోరీకి వ్యతిరేకంగా. రాహుల్ గాంధీ కొంతకాలంగా భారతదేశ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకల గురించి మాట్లాడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన అనేక దృష్టాంతాలను బయటపెడుతున్నారు.'ప్రతిపక్ష నాయకుడిగా నేను నూటికి నూరు శాతం ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయను, నా ఆరోపణలను నిరూపిస్తాను' అని చెప్తున్నారు. తాజాగా ఆయన కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గం, మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గంలో ఓట్ల నమోదు విషయంలో జరిగిన అవకతవకల గురించి మాట్లాడారు. వాటికి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని చెప్తున్నారు. ఫేక్ మొబైల్, ఫేక్ లాగిన్లతో ఓట్ల రద్దు జరుగుతున్నదని, సాఫ్ట్ వేర్ ద్వారా కేంద్రీకృతంగా ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో కర్ణాటక రాష్ట్రంలో సిఐడి ఎఫ్ఐఆర్ నమోదు చేసినా కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోకపోవడంపట్ల ఆయన ఫిర్యాదు చేశారు. ఇన్ని జరుగుతూ ఉంటే పారదర్శకంగా ఉండాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం పత్రికా గోష్టులు నిర్వహించి ముళ్ళ మీద కూర్చున్నట్టుగా మొక్కుబడి సమాధానాలు ఇచ్చి తప్పించుకుంటున్నదే తప్ప తన పారదర్శకతను నిరూపించుకోవడానికి, రాజ్యాంగబద్ధమైన సంస్థ స్వతంత్రతను కాపాడుతున్నామని ప్రజలలో విశ్వాసం కలిగించడానికి ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం విచారకరం.రాజ్యాంగ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘం ఇంత అప్రతిష్ఠపాలు కావడానికి, ప్రజల దృష్టిలో పలుచన కావడానికి కారణమేమిటో 30 ఏళ్ల క్రితమే ఈ వ్యవస్థకు నేతృత్వం వహించిన టీఎన్ శేషన్ చెప్పారు. ఆయన 1990 నుంచి 1996 వరకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ గా పనిచేశారు. ఈ దేశంలో ఎన్నికల సంఘం అనే వ్యవస్థ ఒకటి ఉన్నదని, అది పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధ సంస్థ అని జనానికి తెలిసి వచ్చింది ఆయన కాలంలోనే. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అంటే ఆయన ఒప్పుకునేవారు కాదు. ఈ వ్యవస్థ భారత ప్రభుత్వంలో భాగం కాదు, భారతదేశానికి సంబంధించినది కాబట్టి 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా' అని మాత్రమే అనాలని ఆయన ప్రకటించారు. స్వతంత్ర ఎన్నికల సంఘాలు లేని కారణంగా ప్రజాస్వామ్యాలకు ఎంత హాని జరుగుతున్నదో ఆయన ఆనాడే చెప్పారు. ఎన్నికలనేవి ఒక ప్రహసనంగా, తమాషాగా, రౌడీయిజానికి నిలయాలుగా తయారయ్యాయని ఆయన మీడియా సంస్థలకు ఇచ్చిన పలు ఇంటర్వ్యూలలో చెప్పారు.భారతదేశంలో జరుగుతున్న అవినీతిలో ఎన్నికలకు సంబంధించిన అవినీతే అధిక భాగమని అన్నారాయన. ఎన్నికలలో మూడు 'సి' లు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయని, ఒకటి క్యాష్.. రెండు క్రిమినాలిటీ.. మూడు కరప్షన్ అంటే నగదు, నేర ప్రవృత్తి, లంచాలు. రాహుల్ గాంధీ రాజకీయాల్లో ఇంకా ఓనమాలు కూడా నేర్చుకోనినాడే ఈ విషయాన్ని శేషన్ చెప్పారు. భ్రష్టు పట్టిపోతున్న ఎన్నికల వ్యవస్థలో మరో కోణాన్ని రాహుల్ గాంధీ బయటపెట్టి జెన్ జెడ్ పౌరులను ఈ ఉద్యమంలోకి ఆహ్వానిస్తున్నారు. ఇది ఇప్పుడే కొత్తగా జరుగుతున్నదేం కాదు.ఇటీవల నేపాల్‌లో జరిగిన సంఘటనల నేపథ్యంలో మహారాష్ట్ర శివసేన నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు సంజయ్ రౌత్ వ్యాఖ్యానిస్తూ ఇవాళ నేపాల్ లో జరిగినది రేపు ఏ దేశంలోనైనా జరగవచ్చు అన్నారు. వెంటనే ఆయన యువతను రెచ్చగొడుతున్నారనో, మరో కారణంతోనో ఆయన మీద కేసు కూడా పెట్టినట్టు ఉన్నారు. గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలలో ఒక వార్త చక్కర్లు కొడుతున్నది. అదేమిటంటే, ఒక రాష్ట్ర మంత్రి కుమారుడు ఏదో ఒక బ్యాంకు నుండి పెద్ద మొత్తంలో తీసుకున్న రుణం ఎగ్గొట్టడానికి తన కారును నీటిలోకి తోసేసి, తానూ మరణించినట్టు సృష్టించి మహారాష్ట్రకు వెళ్లి దాక్కున్నాడని. పోలీసుల దర్యాప్తులో ఇదంతా బయటపడి ఆ మంత్రి కుమారుణ్ని పట్టుకొని, ఇటువంటి నేరానికి కేసు పెట్టడానికి సెక్షన్లేవి లేని కారణంగా అతడిని తీసుకుపోయి తల్లిదండ్రులకు అప్పగించినట్టు వార్తలు వచ్చాయి. రాజకీయ ప్రముఖుడి కుమారుడు కాబట్టి వదిలేశారనే అపవాదు మూటగట్టుకున్నారు పోలీసులు.రాజకీయ నాయకులు, వారి కుమారులు చేసే ఇటువంటి నిర్వాకాల కారణంగానే యువత నేపాల్ లో వీధుల్లోకి వచ్చి ఉద్యమం చేసి ఆ ప్రభుత్వాన్ని కూలదోసింది. తమ ఆందోళనలో హింస కూడా చెలరేగి కొంత విధ్వంసం జరగడంతో మళ్లీ అదే యువత ధ్వంసం అయిన ప్రాంతాలలో స్వయంగా మరమ్మతులు చేపట్టినట్టు కూడా వార్తలు చదివాం. నేపాల్‌లో జెన్ జెడ్ ఉద్యమం హింస ఉద్దేశంగా ప్రారంభం కాలేదు. సరే, ఏ ఉద్యమమైనా ఒక దశలో సరైన మార్గదర్శకం లేకపోతే పెడదారి పట్టి విపరిణామాలకు దారితీయడం మామూలే. అదే నేపాల్‌లో జరిగింది. అక్కడ అధికారంలో ఉన్నవారు వారి సంతానం, సన్నిహితులు పెద్దయెత్తున అవినీతికి పాల్పడుతుంటే దానిని సామాజిక మాధ్యమాలు బయటపెడుతున్నాయన్న దుగ్ధతో ప్రభుత్వం వాటిని నిషేధిస్తే వీధుల్లోకి వచ్చిన జెన్ జెడ్ ఉద్యమించి ఆ నిర్ణయాన్ని ఉపసంహరింప చేయడమే కాకుండా అవినీతి పాలకులకు వ్యతిరేకంగా ఆందోళన కొనసాగించి వారిని గద్దె దింపింది. నేపాల్ చిన్న దేశం. అక్కడ జరిగిన విధంగానే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో కూడా జరుగుతుందనుకోవడం పొరపాటు. అయితే ఆనాడే టిఎన్ శేషన్ చెప్పినట్టు అవినీతి ఊడల మర్రిలా విస్తరించిన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ కూడా అందులో కూరుకుపోవడం వల్ల, తప్పనిసరిగా ఎప్పుడో ఒకప్పుడు జెన్ జెడ్ పరిధిలోకి వచ్చే యువ పౌరుల ఆగ్రహానికి గురి కావలసి రావచ్చు. అది జరగకుండా చూడటానికి దేశంలో రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్ర ప్రతిపత్తికి అడ్డురాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థది. జెన్ జెడ్ అసాంఘిక శక్తి కాదు.. ఏ దేశంలో అయినా దానిదే భవిష్యత్తు.

# ప్రపంచశాంతి గగనకుసుమమే?

న్యూఢిల్లీ,ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న ప్రపంచ దేశాలు అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పాటిస్తాయి. ఈ రోజున కాల్పుల విరమణ, అహింస, సోదరభావం, శాంతిసాధన కోసం ఐక్యరాజ్యసమితి దేశాలను ఒక వేదికపైకి తీసుకొస్తుంది. 1981లో కోస్టారికా ప్రతిపాదించిన తీర్మానం ప్రకారం తొలిసారిగా 1982లో ప్రపంచ శాంతి దినాన్ని జరుపుకోగా, 2002లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 21నే శాశ్వతంగా శాంతి దినోత్సవంగా గుర్తించింది. ప్రపంచ చరిత్రలో రెండు మహాయుద్ధాలు మానవాళిని అమితంగా దెబ్బతీశాయి. 1914–1918 మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో 1.7 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయారు. 1939–1945 మధ్య జరిగిన రెండో ప్రపంచ యుద్ధంలో 7 కోట్ల మంది మరణించారు. హిరోషిమా, నాగసాకి మీద అణుబాంబుల వర్షం మానవజాతి చరిత్రలో చెరగని మచ్చగా మిగిలింది.ఈ విధ్వంసకర పరిస్థితుల్లో భవిష్యత్తులో యుద్ధాలను నివారించడానికి, మానవాళిని రక్షించడానికి ఒక అంతర్జాతీయ వేదిక అవసరమని ప్రపంచ నాయకులు తేల్చారు. లీగ్ ఆఫ్ నేషన్స్ ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలమైపోయినందున దాని స్థానంలో 1945 అక్టోబరు 24న ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించింది. ఐక్యరాజ్య సమితి ఏర్పడినప్పుడు 51 దేశాలు సభ్యులుగా చేరగా, ప్రస్తుతం 193 దేశాలు సభ్యత్వం పొందాయి. ప్రధాన కార్యాలయం అమెరికా న్యూయార్క్‌లో ఉంది. ఐరాసకు సర్వప్రతినిధి సభ, భద్రతా మండలి, ఆర్థిక –సామాజిక మండలి, ధర్మకర్తృత్వ మండలి, అంతర్జాతీయ న్యాయస్థానం, కార్యదర్శితనం అనే ఆరు అంగాలు ఉన్నాయి. భద్రతా మండలిలో మొత్తం 15 సభ్యదేశాలలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ శాశ్వత సభ్యులుగా ఉన్నారు. వీరి వద్ద 'వీటో' హక్కు ఉండటం వల్ల సమితి నిర్ణయాలు తరచుగా అడ్డంకులకు గురవుతున్నాయి. ఐరాస చరిత్రలో అనేక ఘట్టాలు విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 1941లో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్, బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌లు కుదుర్చుకున్న అట్లాంటిక్ చార్టర్, 1945లో శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశం, యాల్టా సమావేశం– ఇవి ఐరాస పునాదులు. 1947లో ఐరాస పతాకం ఆమోదించబడింది. లేత నీలిరంగు నేపథ్యంపై ప్రపంచ పటం, రెండు ఆలివ్ కొమ్మల మధ్య ఉంచబడింది. ఆలివ్ కొమ్మలు శాంతికి ప్రతీకలు.




అధికారిక భాషలు ఆరు: చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, అరబిక్. అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇప్పటివరకు నలుగురు భారతీయులు న్యాయమూర్తులుగా సేవలందించారు: బెనగళ్ నరసింగరావు, నాగేంద్రసింగ్, ఆర్.ఎస్. పాఠక్, దల్వీర్ భండారీ (ప్రస్తుతం కొనసాగుతున్నారు). ఐరాస మానవ హక్కుల పరిరక్షణ, ఆర్థిక– సామాజిక అభివృద్ధి, శరణార్థుల పునరావాసం, శాంతి భద్రతా దళాల ద్వారా వివిధ దేశాలలో శాంతి స్థాపన, అణు నిరాయుధీకరణ వంటి అంశాలలో విశేష కృషి చేసింది. కొరియా, వియత్నాం, ఆఫ్రికా, మధ్యప్రాచ్య సమస్యల్లో శాంతి దళాలను పంపి నష్టాన్ని తగ్గించింది. అయితే విమర్శలూ ఉన్నాయి. తీవ్రవాదాన్ని నియంత్రించడంలో, చిన్న దేశాల సమస్యలను పరిష్కరించడంలో సమితి పరిమితంగా మాత్రమే ఫలితాలు సాధించింది.అమెరికా, రష్యా, చైనా లాంటి శాశ్వత సభ్య దేశాల ఆధిపత్యం చిన్న దేశాలకు శాపంగా మారింది. సిరియా యుద్ధం, ఉక్రెయిన్–రష్యా ఘర్షణ, పాలస్తీనా సమస్య, కశ్మీర్ సమస్యలో ఐరాస అసమర్థత కనిపిస్తోంది. వీటో హక్కు వల్ల సమితి నిర్ణయాలు తరచుగా అడ్డుకట్టకు గురవుతున్నాయి. 80 ఏళ్లుగా ఐరాస ప్రపంచ శాంతి కోసం చేసిన కృషి విశేషమే అయినప్పటికీ, ఇప్పుడు మరో ప్రపంచ యుద్ధం ముప్పు ముందుకు వస్తోందన్న ఆందోళన పెరుగుతోంది. అణ్వస్త్రాలు కలిగిన దేశాలు పరస్పరం ఢీకొనే పరిస్థితులు ఏర్పడితే మానవ జాతి భవిష్యత్తే ప్రశ్నార్థకం అవుతుంది.

## ఐదేళ్లపాటు శ్రీవారి సొమ్ముదోపిడీ

తిరుపతి,వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భారీగా దోచుకున్నారని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. స్వామి వారి హుండీని వైసీపీలోని కీలక నేతలు దోచుకున్నారని విమర్శించారు. గతంలో టీటీడీ నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు కూడా ఇందులో వాటాలు వెళ్లాయని ఆరోపించారు. శనివారం తిరుపతి వేదికగా భానుప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో పవిత్రమైన శ్రీవారి హుండీ నుంచి విదేశీ డాలర్లను దొంగతనం చేసిన కేసును తిరిగి విచారణ చేసేందుకు ఏపీ హై కోర్టు సంచలన ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు భానుప్రకాష్ రెడ్డి.లోక్ అదాలత్‌లో రాజీ అయితే ఏపీ హైకోర్టు ఉత్తర్వులతోనే మళ్లీ విచారణ సాధ్యమని చెప్పుకొచ్చారు. శ్రీవారి పరకామణిలో జరిగిన దొంగతనం కేసును సీబీసీఐడీ విచారణ చేసి అక్టోబర్ 13వ తేదీలోపు సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలో టీటీడీలో ఉన్నతాధికారులుగా పని చేసిన వారికి కూడా ఇందులో వాటాలు ఉన్నాయని విమర్శించారు. సీబీసీఐడీ సీల్డ్ కవర్ నివేదిక హై కోర్టుకు అందిన వెంటనే కీలకమైన వ్యక్తులు జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు. శ్రీ కృష్ణ దేవరాయుల కాలంలో ఇలా దొంగలిస్తే ఉరిశిక్ష విధించారని గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వంలో టీటీడీలో రోజుకూ రూ.10 నుంచి రూ.12 లక్షల వరకు కొట్టేసేవారని... అలా ఎన్నో సంవత్సరాలు దోచుకున్నారని ఆరోపించారు. లెక్కలేనన్ని ఆస్తులు కొన్నారని... చెన్నై సమాచార కేంద్రంలో ఆస్తులను రాయించుకున్నారని భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. లోక్ అదాలత్‌ఈ కేసును రాజీ చేయించేశారని చెప్పుకొచ్చారు. పోలీసు శాఖ నుంచి తీవ్రమైన వత్తిడి వల్ల లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటున్నట్లు విజిలెన్స్ నివేదికలో పేర్కొందని గుర్తుచేశారు. ఈ సంఘటన జరిగినప్పుడు కరుణాకర్ రెడ్డి చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. గోవిందదాసుగా చెప్పుకున్న కరుణాకర్ రెడ్డి అప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అప్పట్లో ఈ కేసు విచారణ చేసిన వ్యక్తి అప్రూవర్‌గా మారారని తెలిపారు. ఆయన సంచలన నిజాలను వెలుగులోకి తీసుకురాబోతున్నారని చెప్పుకొచ్చారు. గతంలో సీసీటీవీ ఫుటేజ్ మొత్తాన్ని డిలీట్ చేసేశారని ఆరోపించారు. పరకామణిలోనే కాదని... తులాభారంలో కూడా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేతివాటం ప్రదర్శించారని విమర్శించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు పూర్తి అయిపోగానే గత పాలకులకు సహకరించిన వారిని టీటీడీ నుంచి పంపేస్తున్నామని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

## యువత ఆకాంక్షలు విస్మరిస్తే తస్మాత్ జాగ్రత్త

హైదరాబాద్,యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి. రామారావు హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్–మసీద్, ఎవరు ఏం తింటున్నారు.. ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయం సాధించారని ఆరోపించారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోదీ గాలికొదిలేశారన్నారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీ–పడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కెటిఆర్ చెప్పారు. రాజకీయాలు యువత భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, యువత ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు.. అని యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందని అన్నారు. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవని, అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు అని పేర్కొన్నారు. కానీ, 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగిందని వివరించారు. ఇప్పుడు చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అని పేర్కొన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నామని అన్నారు. అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్, కేవలం 23 ఏళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించిందని గుర్తుచేశారు. 1945లో హీరోషిమా, నాగసాకిలపై అణుదాడి జరిగి లక్షలాది మంది చనిపోయినా జపాన్ కుంగిపోలేదన్నారు. ఎన్నో భౌగోళిక అననుకూలతలు ఉన్నా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా వాటన్నింటిని తట్టుకుని అద్భుత ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణతో నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్ ఎదిగిందని పేర్కొన్నారు. జపాన్ సాధించినప్పుడు భారతదేశం ఎందుకు సాధించలేకపోయిందో ప్రతీ ఒక్కరు ఆలోచించాలని కోరారు. గత పదేళ్లలో తెలంగాణ సాధించిన ప్రగతిని కెటిఆర్ సోదాహరణలతో వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉందని, ప్రపంచంలోనే అమెజాన్‌కు అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని, కేవలం 10 సంవత్సరాల్లోనే తెలంగాణ ఇన్ని చేయగలిగినప్పుడు, మిగతా భారతదేశం ఎందుకు చేయలేకపోయిందని నిలదీశారు.

## దాడుల్లో అక్రమ మద్యం పట్టివేత

హైదరాబాద్, దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. దాడుల్లో దాదాపు 22లక్షల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక తనిఖీల్లో రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పెద్దఎత్తున నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 585 బాటిళు స్వాధీనం చేసుకోగా, వాటి విలువ సుమారు రూ.21.80 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ వద్ద వాహనాల తనిఖీల్లో గోవా, ఢిల్లీ, హరియాణా నుంచి మద్యం తీసుకువస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్కరు 10 నుంచి 15 బాటిళ్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు–గుర్తించారు. ఈ తనిఖీలో 449 మద్యం బాటిళ్లును స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ డీటీఎఫ్ అధికారులు ధూల్‌పేట్‌లోని ఓ ఇంటిపై దాడి చేసి 72 సీసాలు పట్టు–కున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు జరిపి 47 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

# కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎం అన్నారు

హైదరాబాద్, కాళేశ్వరంపై కాంగ్రెస్ సీనియర్ నేత మధు యాష్కీ మరోమారు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబానికి 'ఏటీఎం'గా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారని గుర్తుచేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా ఇప్పటికీ విచారణ ప్రారంభం కాలేదని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు ఉన్న చోట సీబీఐ, ఈడీలు వచ్చేవి. కానీ ఇక్కడ కేసీఆర్‌పై అసెంబ్లీలో విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు ముందుకు రావడం లేదని మధు యాష్కీ ప్రశ్నించారు. దీంతో బీజేపీ–బీఆర్ఎస్ మైత్రి బయటపడిందని ఆయన వ్యాఖ్యానించారు. తొమ్మిదేళ్ల తర్వాత కవితకు కాళేశ్వరం గుర్తుకు వచ్చిందని, జైలుకు పోయి వచ్చిన ఆమె నీతులు చెప్పడం, అవినీతిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పదేళ్లు బడుగులను దోచిన కవిత... ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం ఏంటి?' అని యాష్కీ ప్రశ్నించారు. కవిత వ్యవహారం చూస్తుంటే కేసీఆర్ రచించిన నాటకం నుండి బయటకు వస్తున్నట్టు- ఉందని, కేసీఆర్ రచించిన 'కవిత'లో కవిత ఓ భాగమని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓపెన్‌గానే ఉంటారని, తప్పితే వెనకాల ఉండి చేయడం ఆయనకు అలవాటు- లేదని చెప్పారు. కవిత వెనకాల సీఎం ఉన్నాడనేది చవకబారు ప్రచారమేనని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్‌కు అనుకూలంగానే ఉంటాయని యాష్కీ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతే ఏం చెప్పాలి అనే దానికోసం కేసీఆర్ కుటుంబం డ్రామా చేస్తుందా అని ప్రశ్నించారు. కవితపై నేరుగా ఆరోపణలు చేస్తూ, హిమాయత్‌నగర్‌లో ఉన్న విమలక్క ఆఫీస్‌ను ఖాళీ చేయించిందని, ఎక్కడా రెంట్ ఇవ్వకుండా చేసిందని ఆరోపించారు. కవితకు పోటీ–గా బతుకమ్మ పెట్టిందని కక్ష సాధించిందని, అలాంటి కవిత ఇప్పుడు బలహీన వర్గాల గురించి మాట్లాడుతుందని విమర్శించారు. ఎంపీగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో డబ్బులు దండుకున్నదని, 10 మందికి శిక్షణ ఇచ్చి 100 మంది డబ్బులు దోచుకుందని యాష్కీ ఆరోపించారు. రైతుల కుటు–ంబాలను ఆదుకుంటాం అని డబ్బులు వసూలు చేసి వెనకేసుకుందని, హీరో నాగార్జున లాంటి వాళ్ల నుండి కూడా డబ్బులు వసూలు చేసి రైతులకు ఇస్తా అన్నదని చెప్పారు. భవిష్యత్ రాజకీయాలపై మాట్లాడుతూ... ఎన్‌డీఏ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాదని యాష్కీ అంచనా వేశారు. కాంగ్రెస్‌ను అడ్డుకోవడం కోసం కేసీఆర్‌ను రక్షించే కుట్రను బీజేపీ చేస్తుందని, అందుకే సీబీఐ విచారణను ఆలస్యం చేస్తుందని ఆరోపించారు. విచారణ చేసి కూడా కేసీఆర్ నిర్దోషి అని చెప్పే ప్రయత్నం కూడా జరగొచ్చని ఆయన హెచ్చరించారు. కేటీ–ఆర్‌పై కూడా విమర్శలు గుప్పించిన యాష్కీ.. కేటీఆర్... సీఎం రమేష్‌ను కలవలేదని చెప్పలేదు. చర్చ చేయలేదని కూడా చెప్పడం లేదని అన్నారు.

# కొత్త వీసా నిబంధనలతో ఇబ్బందులే

న్యూఢిల్లీ,హెచ్–1బీ వీసాకు సంబంధించి అమెరికా కొత్త నిబంధనలపై భారత్ స్పందించింది. ఇది ఇరు దేశాల్లో సంస్థలను ప్రభావితం చేయడంతోపాటు– ఎన్నో కుటుంబాలకు ఇబ్బందికర అంశమని పేర్కొంది. కొత్త వీసా నిబంధనలతో తలెత్తే ఇబ్బందిని అమెరికా గుర్తిస్తుందని భారత్ ఆశాభావం వ్యక్తం చేసింది.వీటి పరిణామాలను సంబంధిత భారత సంస్థలు సహా భాగస్వామ్య పక్షాలన్నీ అధ్యయనం చేస్తున్నాయని తెలిపింది. ఇప్పటికే ప్రాథమిక విశ్లేషణల ఆధారంగా కొన్ని ఊహాగానాలపై స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశాయని భారత విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆవిష్కరణలు, సృజనాత్మకత వంటి అంశాల్లో రెండు దేశాల్లోని సంస్థలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని భారత్ పేర్కొంది. నిపుణుల రాకపోకల వల్ల సాంకేతిక, ఆవిష్కరణలు, పోటీతత్వం, ఆర్థిక వృద్ధితోపాటు– సంపద సృష్టితో ఇరు దేశాలు పరస్పర లబ్ధి పొందాయని తెలిపింది. అయితే, ప్రస్తుతం అమెరికా నిర్ణయంతో ఎన్నో కుటుంబాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇరుదేశాల ప్రజలతో ముడిపడిన అంశంపై జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని, సున్నిత అంశాలపై విధాన నిర్ణేతలు ఆచితూచి అడుగులు వేయాలని సూచించింది.

# భారీ వర్షాలతో నలుగురు మృత్యువాత

రాయచోటి,అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నలుగురు మృత్యువాత పడిన కుటుంబాలను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కులను మంత్రి అందజేశారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున నాలుగు కుటు–ంబాలకు మంత్రి రూ.4 లక్షలు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్‌తో కలిసి మంత్రి పరామర్శించారు. శుక్రవారం రాత్రి వరదనీటిలో కొట్టు–కుపోయి షేక్ ముని, ఇలియాస్, గణేష్ అనే వ్యక్తులు మృతి చెందారు. నిన్న రాత్రి గల్లంతైన బాలిక యామిని మృతదేహాన్ని ఇవాళ ఉదయం గుర్తించారు. సంఘటనా స్థలం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని మాండవ్య నదిలో ఉన్న మురుగు కాలువలో బాలిక మృతదేహం లభ్యమైంది. నాలుగు మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చి ధైర్యం చెప్పారు. రాయచోటిలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు, వరదలు రావడంతోనే ప్రమాదాలు చోటు–చేసుకున్నాయని మంత్రి తెలిపారు. మురుగు కాలువల్లో కొట్టు–కుపోయి నలుగురు మృతి చెందడం కలచివేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గత 30 ఏళ్లలో రాయచోటిలో ఇంతటి భారీ వర్షం ఎన్నడూ చూడలేదన్నారు.

# విద్యావైద్య రంగాలను నిర్లక్ష్యం

అమరావతి,వైకాపా హయాంలో 17 మెడికల్ కాలేజీలు తెచ్చినట్లు జగన్ చెప్పిన మాటలు పచ్చి అబద్ధమని మంత్రి సంధ్యారాణి విమర్శించారు. ఐదేళ్లకాలంలో విద్యవైద్యరంగాలను పూర్తగా నిరల్క్ష్యం చేశారని మండిపడ్డారు. ఆయన హయాంలో రాష్ట్ర ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని చెప్పారు. రూ.1,451 కోట్లు– పూర్తిగా కేంద్ర నిధులే అని.. రాష్ట్రం వాటా సున్నా అని పేర్కొన్నారు. పులివెందుల సహా పలు కాలేజీలకు ఎన్‌ఎంసీ అనుమతుల రద్దుకు జగన్ వైఫల్యమే కారణమన్నారు. తెదేపా పాలనలో మొత్తం 28 మెడికల్ కళాశాలలు స్థాపించాం. మా పార్టీ హయంలోనే నిమ్స్, స్విమ్స్, ఎయిమ్స్, జినోమ్ వ్యాలీ, మెడ్–టె–క్ సిటీ– వంటి సూపర్ స్పెషాలిటీ– సంస్థలు ఏర్పాటు– చేశాం. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ, ప్రతి కుటు–ంబానికి ఆరోగ్య బీమా సీఎం చంద్రబాబు సంకల్పం. పీపీపీ మోడల్‌లో అధునాతన వైద్య సదుపాయాలు కల్పిస్తామని సంధ్యారాణి అన్నారు.

# పిచ్చోడి చేతిలో రాయిలా.. ట్రంప్ నిర్ణయాలు !



వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో అధికారం..పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అని అమెరికన్‌లే ఆందోళన చెందుతున్నారు. ఎందుకు ఓటేశామా..అని అమెరికన్లతో పాటు ఎన్నారైలు కూడా నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఎందుకటే ట్రంప్ ఎప్పుడు ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారో తెలియడం లేదు. ఇలాంటి నిర్ణయాలతో విదేశీయులతో పాటు, అమెరికన్లు కూడా తీవ్ర ప్రభావానికి లోనవుతున్నారు. ప్రధానంగా ఉద్యోగాలు కుంచించుకు పోతున్నాయి. ఉపాధి దక్కడం లేదు. విదేశీయులపై ఆంక్షల వల్ల, ట్రంప్ సుంకాల వల్ల అమెరికా ఆర్థిక పరిస్థితి దిగజారిపోతోంది. ఎప్పుడు మాంద్యం ముంచుకొస్తుందో అన్న భయం వెన్నాడుతోంది. తాజాగా హెచ్1 బి వీసాలపై ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై టె÷– కంపెనీలు సైతం ఆందోళనచెందుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి భారత్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే భారీ పన్నులతో భారత ఎగుమతులను దెబ్బకొట్టిన ట్రంప్.. తాజాగా అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే భారతీయులకు గట్టి షాకిచ్చారు. హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచేశారు. హెచ్1బీ వీసా వార్షిక రుసుమును లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై శుక్రవారం సంతకం చేశారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ ఉత్తర్వు ప్రకారం ఇకపై అమెరికా వేదికగా పని చేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకోవాలంటే ఇకపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాలి. ఇది అమలు సాధ్యమా కాదా అన్నది ఓ నాలుగైదు రోజుల్లో తేలనుంది. అయితే ట్రంప్ టారిఫ్ యుద్ధం కారణంగా అమెరికాలో ఉద్యోగావకాశాలు కూడా సన్నగిల్లుతున్నాయి. అమెరికా కార్మిక శాఖ గణాంకాల ప్రకారం ... గత నెలలో వ్యవసాయేతర ఉద్యోగ నియామకాలు అంచనాల కంటే తగ్గి 22 వేలకు పరిమితమయ్యాయి. అదే సమయంలో నిరుద్యోగిత రేటు– 4.2 శాతం నుంచి 4.3 శాతానికి పెరిగింది. అంతేకాదు, మే, జూన్ నెలలకు విడుదల చేసిన ఉద్యోగ గణాంక అంచనాలను కూడా భారీగా తగ్గించింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఒత్తిడిలో ఉందనడానికి ఇది సంకేతమని విశ్లేషకులు అంటున్నారు. ట్రంప్ సుంకాలు అమెరికన్ కార్పొరేట్ కంపెనీల లాభాలపైనా ప్రభావం చూపనున్నాయని, దాంతో కంపెనీలు వ్యయ నియం త్రణపై దృష్టి సారిస్తాయని, పర్యవసానంగా అక్కడి జాబ్ మార్కెట్ మరింత బలహీనపడే అవకాశాలు న్నాయని జాండీ వివరించారు. అమెరికాకు ఆర్థిక మాంద్యం ముప్పు పొంచి ఉందని ప్రముఖ ఆర్థిక రేటింగ్ కంపెనీ మూడీస్ చీఫ్ మార్క్ జాండీ హెచ్చరించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న విధాన నిర్ణయాలే ఇందుకు కారణమని ఆరోపించారు. ఇటీవల ట్రంప్ పలు దేశాలపై టారిఫ్‌లు విధించిన విషయాన్ని ప్రస్తావించారు. టారిఫ్‌లు ఆయా దేశాలతో పాటు– అమెరికాపైనా ప్రభావం చూపిస్తాయని, దీనికితోడు ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానం ఉద్యోగ నియామకాలను నెమ్మదించేలా చేసిందని చెప్పారు. ఫెడరల్ రిజర్వ్ విషయంలో ట్రంప్ నిర్ణయాల ప్రభావం వ్యాపార రంగంపై భారీగా ఉందని, పెట్టు–బడులు మందగించాయని వివరించారు. వీటన్నింటి ఫలితంగా అమెరికా ఆర్థికవృద్ధి నెమ్మదించడంతో పాటు– ద్రవ్యోల్బణం పెరుగుతోందని జాడీ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, ఆర్థిక మందగమనం లక్షణాలు ఇంకా బయటపడనప్పటికీ నిర్మాణ రంగంతోపాటు– ఉత్పాదక రంగంలో సూచనలు కనిపిస్తు న్నాయని అన్నారు. వివిధ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌ల ప్రభావం అమెరికాలోని వినియోగదారుడిపై ఇంకా పూర్తిస్థాయిలో కనిపించడంలేదని జాడీ తెలిపారు. ఈ సందర్భంగా మదుపరులను జాడీ హెచ్చరిస్తూ ఆర్థిక మాంద్యంలో ఏ స్టాక్ కూడా సురక్షితం కాదని సూచించారు. యూఎస్ జీడీపీలో మూడోవంతు అంటే 33.33 శాతం ఇప్పటికే తిరోగమనంలోకి జారుకుందని జాండీ తెలిపారు. రాష్ట్రాలవారీగా చూస్తే, వ్యోమింగ్, మోంటానా, మిన్నెసోటా, మిస్సిస్సిప్పీ, కాన్సాస్, మసాచుసెట్స్‌కు ఆర్థిక మాంద్యం ముప్పు పొంచి ఉందన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఉద్యోగాలకు భారీగా కోతపెట్టడంతో వాషింగ్టన్ డీసీ కూడా ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటోందని అన్నారు. 2008లో అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని ముందే అంచనావేసిన ఆర్థికవేత్తల్లో జాండీ ఒకరు. ఆ సంక్షోభం అమెరికాతో పాటు మొత్తం ప్రపంచాన్ని కుదిపేసిన సంగతి విదితమే. అమెరికాలో ధరలు, ముఖ్యంగా నిత్యావసరాల రేట్లు– మళ్లీ పెరుగుతున్నాయని.. త్వరలోనే అందుకోలేని స్థాయికి ధరలు ఎగబాకవచ్చని జాండీ అన్నారు. తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ధరాభారం కారణంగా అమెరికన్ల కొనుగోలు శక్తి కూడా తగ్గిందని, వినియోగదారుల వ్యయ వృద్ధి 2008–09 ఆర్థిక సంక్షోభ కాలం నాటి కనిష్ఠ స్థాయికి జారుకుందన్నారు. ఈ జూలై లో అమెరికాలో వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం మరో 0.2 శాతం పెరిగి 2.7 శాతానికి చేరుకుంది. వచ్చే ఏడాదికాలంలో సూచీ 4 శాతానికి ఎగబాకవచ్చని జాండీ అంచనా వేశారు. తత్ఫలితంగా అమెరికన్ల కొనుగోలు శక్తి మరింత తగ్గిపోవచ్చని జాండీ వివరించారు. వరుసగా రెండు త్రైమాసికాల పాటు జీడీపీ వృద్ధి రేటు క్షీణిస్తే ఆ దేశం ఆర్థిక మాంద్యంలోకి జారుకున్నట్లు గా పరిగణిస్తారు. ట్రంప్ సుంకాల యుద్ధం ఫలితంగా ... ఈ ఏడాది తొలి త్రైమాసికం జనవరి–మార్చి లో అమెరికా జీడీపీ 0.50 శాతం క్షీణించగా.. రెండో త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో మాత్రం 3.3 శాతం వృద్ధిని నమోదు చేయగలిగింది. ప్రస్తుతం అమెరికా పరిస్థితి చావుతప్పి కన్ను లొట్టబోయినట్లుగా ఉంది. పెరుగు తున్న ధరలు, సుంకాలతో పెరిగిన వాణిజ్య అనిశ్చితి, తగ్గుతున్న కొనుగోళ్లు మున్ముందు త్రైమాసికాల్లో ఆ దేశ జీడీపీని మాంద్యంలోకి నెట్టవచ్చునని తెలుస్తుంది. తాజా నిర్ణయాలు మరింత సంక్షోభానికి కారణం అవుతాయని అంటున్నారు. విదేశ నిపుణులు ముఖ్యంగా భారతీయులు వెళితే అమెరికాలో పనిచేసే వారు కరువవుతారని ఆందోళన చెందుతున్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలను అక్కడి చట్టాలు అడ్డుకుంటాయా లేదా అన్నదానిపై ఆధారపడి ఉంటుంది.

# రెవెన్యూ సీనియార్టీ మళ్లీ మొదటికి! కన్ఫర్డ్ ఐఏఎస్‌ల ఆశలు ఆవిరి!



హైదరాబాద్,రాష్ట్రంలో కన్ఫర్డ్ ఐఏఎస్ (పదోన్నతులు) జాబితా రూపకల్పనలో నిబంధనలు పాటించడం లేదని సచివాలయ జీఏడీ ఉన్నతాధికారి ఒకరు ముందే హెచ్చరించారు. ఆయన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, సరిచేసి నిబంధనల ప్రకారం జాబితాను పంపించి ఉంటే ఆమోదం లభించేది. కానీ.. ఆయన అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ, నిబంధనలు తోసిరాజని ఢిల్లీకి గత నెలలో ఫైలు పంపించారు. ఈ ఫైలుపై అనేక అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం లేవనెత్తి, వీటిపై సమగ్రంగా సమాధానాలు పంపించాలని తాజాగా ఆదేశించింది. నిబంధనల ప్రకారం ఫైలు లేదంటూ యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) కొర్రీలు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపించింది. కన్ఫర్డ్ ఫైలు ఢిల్లీకి వెళ్లింది, సెప్టెంబర్ చివరి నాటికి ఆమోదం వస్తుందని, అక్టోబర్ నెలలో పోస్టులు దక్కించుకుందామని ఆశించిన పలువురు రెవెన్యూ అధికారుల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లిందంటున్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో ఇష్టారాజ్యం

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీజీపీఎస్సీ ద్వారా గ్రూపు వన్ ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. జోనల్ కారణం, ఇతరత్రా కారణాలు సాకుగా చెప్పి ఉద్యోగ నియమాకాలను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఫలితంగా తెలంగాణలో స్టేట్ సివిల్ సర్వీసు నుంచి ఐఏఎస్‌కు ఎంపికయ్యే విధానంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ వన్ సర్వీసుకు ఎంపికైన అధికారులు మాత్రమే ఐఏఎస్‌గా కన్ఫర్డ్ (పదోన్నతి) అర్హత సాధించేవారు. అర్హత సాధించిన వారిలో కొందరికి మాత్రమే ఐఏఎస్ పదోన్నతి లభించేది. ఇందులో కూడా పైరవీలు, సిఫారసులు ఉన్నవారికి మాత్రమే దక్కేవన్న మాటలో వాస్తవమున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎంపీడీవో స్థాయి అధికారికి కూడా ఐఏఎస్ కన్ఫర్డ్ లభించిందంటే ఆ పదవిని ఎంతగా దిగజార్చారనేది సుస్పష్టమవుతున్నదని సీనియర్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. దేశంలో ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీసులకు ఎంపిక కావడం కోసం కొన్ని లక్షల మంది ఔత్సాహికులు పోటీపడి, అందులో కొన్ని వేల మంది మాత్రమే ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తారు. ప్రిలిమ్స్‌లో పాస్ అయినా, అందులో ఇంటర్వ్యూకు వందల సంఖ్యలో మాత్రమే పిలుపు వస్తుంది. ఇలా వడపోత తరువాత రెండు మూడు వందల లోపే ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికవుతా రు. శిక్షణ తరువాత ర్యాంకుల ఆధారంగా రాష్ట్రాలకు కేటాయిస్తారు.

ముందే అభ్యంతరం చెప్పిన డీపీసీ

ప్రొబెషనరీ డిప్యూటీ కలెక్టర్లు (ప్రొ డీసీలు), ప్రమోటీస్ (ప్రొ డీటీలు) మధ్య వివాదం కారణంగా కొన్ని నెలలుగా రాష్ట్రంలో ఐఏఎస్ పదోన్నతుల అంశం పెండింగ్‌లో ఉంది. ఈ రెండు వర్గాల మధ్యనున్న వివాదాన్ని అప్పటి రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సర్దుబాటు చేయించారు. ఆ తరువాత ప్రొబెషనరీ డీటీ నుంచి సెలెక్షన్ గ్రేడ్ వరకు పదోన్నతి పొందిన అధికారులతో సీనియార్టీ జాబితాను రూపొందించారు. ఈ జాబితాను జూలై నెలలోనే సిద్ధం చేసి తుదిరూపు తీసుకువచ్చారు. రాష్ట్ర నిబంధనల ప్రకారం డిప్యూటీ డైరెక్టర్ పై స్థాయి అధికారులకు పదోన్నతి కల్పించేందుకు సచివాలయంలోని ఉన్నతాధికారులో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఉంటుంది. ఈ కమిటీకి జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్ గా ఉన్నారు. స్టేట్ సివిల్ సర్వీసు అధికారుల సీనియార్టీ జాబితాను ఈ కమిటీ ఖరారు చేస్తుంది. అయితే ఈ సీనియార్టీ జాబితాపై కన్వీనర్ పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆయన లేవనెత్తిన అభ్యంతరాలు ఇలా ఉన్నాయి. పాత ప్యానెల్ ప్రకారం పదోన్నతుల జాబితా ఇప్పుడు తయారు చేయడం సరికాదని అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించలేదని, వార్షిక పనితీరు (ఏసీఆర్) నివేదికలు కూడా పొందుపర్చలేదన్నారు. ఎవరెవరిపై శాఖాపరమైన, విజిలెన్స్, ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ కేసులు ఎన్ని ఉన్నాయనేది జతపర్చలేదు. సీనియార్టీ జాబితాలో రిటైర్డు అయిన వారి పేర్లు కూడా పొందుపర్చాలి, పదవీ విరమణ చేశారని జాబితా నుంచి ఎలా తీసివేస్తారని ఆయన లేవనెత్తారు. నిబంధనల ప్రకారం ఫైలు లేదని, అన్నీ తప్పులే ఉన్నాయని అభ్యంతరం తెలిపారు. 2020–21 జనవరి 1వ తేదీ నాటికి 56 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఎందరున్నారంటూ ప్రశ్నించారు. వీటిని సరి చేసిన తరువాత మళ్లీ ఫైలు పంపించాలని తన నోట్ లో కమిటీలో సభ్యుడు అయిన రెవెన్యూ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. ఈ వివరాలు అన్ని పొందుపరిస్తే చాలా మంది పేర్లు తొలగించాల్సి వస్తుందని, సీనియార్టీ తల్లకిందులు అవుతుందని అంచనా వేశారు. ఇవేమీ పట్టించుకోకుండా సీనియార్టీ ఫైలును సిద్ధం చేశారు. ఈ లోపు నవీన్ మిట్టల్ ఇంధన శాఖకు బదిలీ కావడం, ఆయన స్థానంలో డిఎస్.లోకేశ్ కుమార్ జూన్ రెండో వారంలో రెవెన్యూ కార్యదర్శిగా నియమించారు. లోకేశ్ కూడా సీనియార్టీకి ఆమోదం తెలిపారు. అయితే ఆయన మేడ్చల్ జిల్లా డీఆర్‌ఓ జేఎల్పీ. హరిప్రియ పేరును చేర్చాలని కోరగా, ఏమైందో ఏమో కాని చేర్చలేకపోయారని విశ్వసనీయంగా తెలిసింది. ఆ తరువాత సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ పొలిటికల్) ఎం.రఘునందన్ రావు తో ఆమోద ముద్ర వేయించుకుని, ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు వద్దకు పంపించడంతో ఆయన కూడా ఆమోదం తెలిపారని అధికార వర్గాల ద్వారా తెలిసింది. గత నెల 20వ తేదీన ఐఏఎస్ (కన్ఫర్డ్) కోసం అర్హులైన వారి జాబితాను ఢిల్లీకి ప్రత్యేక దూత ద్వారా పంపించారు. మొత్తం ఖాళీలు 21 ఉండగా, 61 మందితో జాబితాను పంపించారు. మరో నలుగురు పేర్లను త్వరలో అందచేస్తామని ఢిల్లీలో యూపీఎస్సీ అధికారులకు తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరుకు కన్ఫర్డ్ వస్తుందని అందరూ ఆశల పల్లకిలో ఊరేగారు. కానీ అంచనాలు తల్లకిందులు అయ్యాయి.

యూపీఎస్సీ పలు అభ్యంతరాలు

అసలు సీనియార్టీ జాబితాను ఎవరు ధృవీకరించారో స్పష్టత లేదని, కార్యదర్శి సంతకంతో ధృవీకరించలేదని యూపీఎస్సీ లోపాన్ని ఎత్తి చూపింది. పదోన్నతులకు ఆమోదం తెలిపిన కమిటీ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లు కూడా పంపించాలని కోరింది. ఇందులో పలువురి ఏసీఆర్ లు, రివ్యూ అథారిటీ ధృవపత్రం, యాక్సెప్టింగ్ అథారిటీ రిమార్కులు జతపర్చలేదని తెలిపింది. ఇలా తప్పుల తడకతో ఉన్న వివరాలు నిబంధనల ప్రకారం సరిచేసి మళ్లీ పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని కోరింది.

# ఆదిపరాశక్తి రూపమే అమ్మవారు

విజయవాడ,అణువుల నుంచి బ్రహ్మాండాల వరకూ వ్యాపించిన విశ్వరూపిణి, విజయ వినోదిని ఆదిపరాశక్తి. ఒకరు కాదు, ఇద్దరు కాదు.. అమ్మల రూపంలో సమస్త మానవాళిని పులకింపజేయడానికి ఆ జగజ్జననియే తరలి వస్తున్న శుభవేళయే దసరా శరన్నవరాత్రులు. ఆశ్వీయుజ మాసం తొలి రోజుల్లో జరిగే ఈ రెండు వేడుకల్లోనూ కోట్లాది మందితో ఆరాధనలు అందుకొనే దైవం ఒక స్త్రీమూర్తి కావడం విశేషం. ఆమెనే సకల జగముల నేలే జగదాంబ. ప్రతీ ఒక్క మానవ మాత్రునికీ అత్యంత విశిష్ఠమని చెప్పాలి. అమ్మవారిని రోజూ నిష్టగా పుల రూపాల్లో పూజించడంతో పాటు నైవేద్యాలు సమర్పించి ఆరదాధించడం ఈ పండగ ప్రత్యేకత. వర్షఋతువు తర్వాత వచ్చే శరదృతువు అంటేనే వెన్నెల కాచే చల్లని సమయం. దేవీ నవరాత్రులను కూడా ప్రతీ హైందవ సమాజమూ అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపుకుంటుంది. ఎందుకంటే, దుర్గాదేవి , అమ్మల గన్న యమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ అన్నా.. ఎవరో కాదు, ఆ ఆదిపరాశక్తే. నమ్మిన వారికి, దైవిక సిద్ధాంతాన్ని ఆచరించే వారికి ఆమె అనేక రూపాలలో దర్శనమిస్తుంది. ఈ శక్తి కూడా అనేక రూపాలలో కనిపిస్తున్నది. అనంత విశ్వం మహాశక్తిపైనే ఆధారపడి ఉంది. భారతీయ ధర్మశాస్త్రాలు ప్రతీ స్త్రీమూర్తినీ శక్తికి ప్రతీకగా అభివర్ణించాయి. ఆ మాటకొస్తే అవి నారీమణులను పూజ్యనీయుల జాబితాలోకే చేర్చాయి. త్రిమూర్తులను, త్రిమాతలను, ఇంకా మొత్తంగా దేవతల గణాన్నందరినీ సృష్టించింది ఆదిపరాశక్తియే. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమెనే యావత్ సృష్టికి కర్త కర్మ క్రియ. కాబట్టి, సర్వశక్తులకూ కేంద్రస్థానం ఈ మహాశక్తి. సృష్టికర్త, సంరక్షకురాలు, దుష్ట వినాశనకారి సర్వం ఆమెనే అని దేవీ భాగవత పురాణం పేర్కొన్నది. ఏడు సింహాలతో కూడిన రత్నాల సింహాసనంపైన ఆదిశక్తి కూర్చుని ఉండడాన్ని త్రిమూర్తులు చూసినట్లు అందులో ఉందని వేదపండితులు చెప్తారు. ఆదిబీజమే (ఆదిపరాశక్తి) తనంతట తాను పురుషుడుగా, ప్రకృతి (స్త్రీ)గా విభజితమైనట్లు అష్టాదశ పురాణాలలో ప్రధానమైన బ్రహ్మ పురాణం తెలిపింది. దేవీ భాగవతం ప్రకారం శక్తిలోని శకు ఐశ్వర్యమని, క్తికి పరాక్రమమని అర్థం చెప్పారు. సృష్టి ఆరంభంలో ఒక్క దేవి మాత్రమే ఉందని, ఆమెయే ఈ బ్రహ్మాండాలన్నింటినీ సృష్టించిందని బహ్వృచోపనిషత్‌లోనూ కనిపిస్తుంది. ఆమె నుండే త్రిమూర్తులు, సర్వమూ ఉద్భవించినట్టు కూడా అందులో ఉంది. ఎప్పుడైతే భూమిమీద దానవత్వం పెరుగుతుందో అప్పుడు తాను అవతరించి దుష్టశిక్షణ జరుపుతానని జగజ్జనని అన్నట్టు దేవీసప్తశక్తి పేర్కొంటున్నది. జగత్తులన్నింటికీ మూలమైన భగవంతుణ్ని సైతం సృష్టించింది భగవతి అయిన ఈ పరాశక్తియే. ఇంతేకాదు, ప్రతీ అణువణువులోని ప్రాణశక్తికి, ఆత్మయిక జీవుల్లో నిగూఢంగా ఉండే కుండలినీ శక్తులకూ, పరమాత్మలోని యోగ–మహామాయలకు.. అన్నింటికీ ఆదిమూలమూ ఆమెనే అని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. ఆ మహాశక్తి విశ్వరూపంలో మన దర్శనానికి అందింది అత్యల్పం. కాబట్టి, ప్రతి ఒక్కరూ అహాన్ని పక్కన పెట్టి శక్తి ఆరాధనకు సంసిద్ధులు కావాలి.శక్తి ఆరాధనను ఏదో ఒక మతానికో, వర్గానికో పరిమితం చేయనవసరం లేదు. విశ్వంలో కనిపించని శక్తులూ ఇంకా శాస్త్రవేత్తల మేధకు, విజ్ఞాన శాస్త్రాలకు అందకుండానూ ఉన్నాయి. అవన్నీ మహావిశ్వంలో భాగమే అయినప్పుడు, మానవాళికి సర్వతోముఖాభివృద్ధికి అవన్నీ ఉపయోగపడుతున్నప్పుడు వాటిని శక్తి రూపంలో ఆరాధించడంలో తప్పులేదు.

# చేతులెత్తేసిన సర్కార్!

హైదరాబాద్, తెలంగాణలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి రెండేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కూడా రెండేళ్లు కావస్తోంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో రేవంత్ సర్కార్ జాప్యం చేస్తోంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరుపాలని దాఖలైన పిటిషన్లను విచారణ చేసి హైకోర్టు.. సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. అయితే మొదట హడావుడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం చివరకు ఇప్పుడు నిర్వహించలేమని చేతులు ఎత్తేసింది. ఇందుకు రిజర్వేషన్ల పెంపును సాగుకుడా చూపుతోంది. ఢిల్లీలో శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టమైన వైఖరి వ్యక్తం చేశారు. ఈ నెల 30 లోపు ఎన్నికల నిర్వహణ అసాధ్యమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదాలు ఆలస్యమవుతున్నం దున తీర్పు వచ్చే వరకు ఎదురుచూడాలని పేర్కొన్నారు. 'బీసీ రిజర్వేషన్ బిల్లు.. స్థానిక ఎన్నికలు ఆలస్యమవడానికి ప్రధాన కారణం బీసీలకు 42 శాతం కేటాయింపు బిల్లు. అసెంబ్లీలో ఆమోదించబడిన ఈ చట్టానికి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఇంకా సంతకం చేయలేదు. కేంద్రం కూడా అడ్డుకుంటోందని ఆరోపణలు ఉన్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 30లోపు ఎన్నికలు జరపాలని ఉన్నప్పటికీ, 50 శాతం మించే రిజర్వేషన్‌లు చట్టవిరుద్ధమనే సుప్రీంకోర్టు నిబంధనలు ప్రభుత్వాన్ని పునరాలోచనలో పడేశాయి. ప్రభుత్వం ఇప్పుడు ఈ అంశంపై విస్తృత సమీక్షలు చేస్తోంది. రిజర్వేషన్ ఖరారు లేకుండా ఎన్నికలు నిర్వహించడం రాజకీయంగా ప్రమాదకరమని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే గ్రామ పంచాయతీలు, జెండీపీసీలు వంటి స్థానిక సంస్థల ఎన్నికలను జాప్యం చేస్తోంది.

నేతల్లో నిరాశ.. ఆశావహుల్లో ఆందోళన

సీఎం ప్రకటనతో కాంగ్రెస్ పార్టీలోని స్థానిక నాయకులు, ఎన్నికల అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎన్నికలు ఆలస్యమైతే పార్టీల మధ్య పోటీలు ప్రభావితమవుతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పింఛన్ల పెంపు లేకపోవడంతో గ్రామీణులు అసంతృప్తితో ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా జాప్యం జరుగుతోంది. యూరియా కొరత రైతులను ఇబ్బంది పెడుతోంది. ఎన్నికల ఆలస్యంతో అధికార పార్టీకే నష్టమన్న అభిప్రాయం ఉంది. ఆర్థిక భారం, చిన్న పార్టీల పోటీలు పెరగడం వల్ల కాంగ్రెస్ బలహీనపడవచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.పంచాయతీ ఎన్నికల ఆలస్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా రెండు ఇబ్బందులు ఉన్నాయి. ఒకవైపు రిజర్వేషన్‌ల ద్వారా బీసీల మద్దతు సాధించాలనే లక్ష్యం, మరోవైపు హైకోర్టు ఆదేశాలు, కేంద్ర ఆటంకాలు ప్రభుత్వాన్ని బలహీన స్థితిలో ఉంచాయి. ఎన్నికలు ఆలస్యమైతే, గ్రామీణ ఓటర్లలో అసంతృప్తి పెరగవచ్చు. విపక్షాలు దీన్ని ప్రచారంగా మలిచుకోవచ్చు. బీజేపీ ఇప్పటికే కాంగ్రెస్‌ను 'ఎన్నికల భయం'తో ఆరోపిస్తోంది. భవిష్యత్తులో, సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఎన్నికలు జరిగితే, రిజర్వేషన్‌లు సమతుల్యంగా రూపొందించడం కీలకం. లేకపోతే, స్థానిక పాలనలో అంతరాయాలు పెరిగి, ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.

# సైబర్ మోసంలో విశ్రాంత వైద్యుడు

బాపట్ల,బాపట్ల జిల్లా చీరాల పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ మోసం జరిగింది. విశ్రాంత వైద్యుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.10 కోట్లు– కాజేసిన ఘటన కలకలం రేపింది. చీరాలకు చెందిన ఓ విశ్రాంత వైద్యుడికి ఫోన్ చేసిన సైబర్ కేటుగాళ్లు.. మనీలాండరింగ్‌కు పాల్పడ్డావంటూ బెదిరించారు. డబ్బులు పంపిస్తే తిరిగి ఖాతాలో జమచేస్తామని చెప్పారు. నిజమేనని నమ్మిన విశ్రాంత వైద్యుడు.. పలు దఫాలుగా రూ.1.10 కోట్లు– పంపించాడు. ఆ తర్వాత నగదు తన ఖాతాలో జమకాకపోవడం, ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో

## నెక్స్ట్ జెన్ జీఎస్టీ ఉత్సవ్.. ప్రతిపక్షాలకు షాక్ ఇచ్చిన నరేంద్ర మోడీ!



న్యూఢిల్లీ, పెద్ద నోట్ల రద్దు, కరోనా పీడ దినాలు.. ఇలా అనేక సందర్భాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన అలా ప్రసంగించిన ప్రతి సందర్భంలోనూ సంచలన విషయాలను పంచుకున్నారు. ఆ విషయాలన్నీ జాతిని జాగృతం చేసే దిశగా నడిచాయి. విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. తాజాగా నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈసారి కూడా సంచలన విషయాలను పంచుకున్నారు.అమెరికా హెచ్ వన్ బీ వీసాల మీద తీసుకున్న నిర్ణయం.. ఓట్ చోరీ.. నేపాల్ దేశంలో ఆందోళనలు.. ఇన్ని పరిణామల మధ్య నరేంద్ర మోడీ ఏదో ఒక కీలక విషయాన్ని వెల్లడిస్తారని.. సంచలన విషయాలను ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. దానికి తగ్గట్టుగానే నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. సంచలన విషయాలను వెల్లడించారు.. ఇటీవల కాలంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారతదేశంలో కూడా నేపాల్ మాదిరిగానే జెడ్ జనరేషన్ ఉద్యమం వస్తుందని వ్యాఖ్యానించారు . ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. ఏ క్షణమైనా సరే మనదేశంలో పెను ప్రకంపనలు చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మాటలు ఏ రాజకీయ నాయకుడు అన్నా పెద్దగా పట్టింపు ఉండేది కాదు. రాహుల్ గాంధీ ఈమాటలు అనడంతో సాధారణంగానే చర్చ మొదలైంది. దీనిపై బీజేపీ కూడా ఘాటుగానే స్పందించినప్పటికీ.. మోడీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మోడీ ఎందుకు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారో అర్థం కాలేదు.. చివరికి తన మౌనాన్ని వీడిన ప్రధానమంత్రి.. ప్రతిపక్షాలకు ముఖ్యంగా రాహుల్ గాంధీకి షాక్ ఇస్తూ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ లో మార్పులు తీసుకొచ్చింది.. ఐదు శాతం, 18 శాతం స్లాబులు మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చింది. కొన్నింటి పైన జీరో శాతం పన్ను అనే విధానాన్ని అమలులోకి తెచ్చింది. సెప్టెంబర్ 22 నుంచి ఇది మొదలు కాబోతోంది. దానికంటే ముందు ఒకరోజు నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి జీఎస్టీ సంస్కరణల వల్ల జరిగే మార్పులను వెల్లడించారు.. "రేపటి నుంచి దేశంలో నవరాత్రి ఉత్సవాలు మొదలవుతున్నాయి. దాంతోపాటు జీఎస్టీ బచత్ ఉత్సవం కూడా మొదలవుతుంది. రేపటి సూర్యోదయం నుంచి ఐదు శాతం, 18% జీఎస్టి స్లాబులు మాత్రమే అమల్లోకి వస్తాయి. దీంతో ప్రతి ఇంట్లో సంతోషం వెల్లి విరుస్తుంది. ఈ సంస్కరణ భారతదేశ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంది. ఆత్మనిర్భర్ దిశగా ఇది కీలకమైన ముందడుగు. గతంలో ప్రతి చోట రకరకాల పన్నులు విధించేవారు. ప్రజలను ఇబ్బందులు పెట్టేవారు. ప్రజలను గందరగోళం నుంచి బయటపడడానికి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. వన్ నేషన్ వన్ టాక్స్ స్వప్నం సాకారం అయింది. సరికొత్త చరిత్ర సృష్టించేందుకు ఈ సంస్కరణలు తోడ్పడతాయి. ఫలితంగా పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుంది. రేపటి నుంచి నెక్స్ట్ జెన్ జీఎస్టీ ఉత్సవం ప్రారంభమవుతుందని" నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ జనరేషన్ జెడ్ తరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. వారిలో నేపాల్ తరహాలో ఉద్రేకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మాత్రం అలాంటివి చేయకుండా ఈ జనరేషన్ కు జీఎస్టీ మార్పుల వల్ల లాభం జరుగుతుందని పేర్కొన్నారు. యువత వల్లే దేశం ఈ స్థాయిలో ఉందని.. వారి కోసం ఏమైనా చేస్తామని ప్రకటించారు. తద్వారా రాహుల్ గాంధీ ఆశలపై నీళ్లు చల్లారు నరేంద్ర మోడీ.

## కొత్త జీఎస్టీ విధానంతో ఏపీకి ఎంత ప్రయోజనం?




దేశంలో నూతన జీఎస్టీవిధానం ఈరోజు నుంచి అమల్లోకి వచ్చింది. సామాన్యులకు ఊరటనిచ్చేలా అనేక వస్తువులపై జీఎస్టిని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. చాలా రకాల వస్తువులను ఐదు శాతం జీఎస్టీ పరిధిలోకి రావడంతో వాటి ధర తగ్గనుంది. నూతన జీఎస్టీ విధానానికి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక బుక్ లెట్ విడుదల చేశారు. ఇది పూర్తిగా తెలుగులోనే రూపొందించారు. మరోవైపు కొత్త జీఎస్టీ విధానం కారణంగా ఏపీ ప్రజలకు 8 వేల కోట్ల రూపాయల వరకు ప్రయోజనం అని ఏపీ వాణిజ్య పనుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు తెలిపారు.

భారీగా ధరలు తగ్గుముఖం..

చాలా వస్తువులపై ప్రస్తుతం జీఎస్టీ 18% ఉంది. అది ఐదు శాతానికి తగ్గితే భారీగా ధరలు తగ్గుతాయని వాణిజ్య పనుల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా వెన్న, నెయ్యి,పన్నీరు, సబ్బులు, షాంపూ, హెయిర్ ఆయిల్, ప్రాసెస్డ్ ఫుడ్, బిస్కెట్లు, కాఫీ వంటి వాటిపై పన్ను తగ్గనుంది. ప్యాకేజ్డ్ పాలు, పన్నీరు, బ్రెడ్ వంటి వాటికి జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ వాటిపై జీఎస్టీని 28% నుంచి 18 శాతానికి తగ్గించడంతో మధ్యతరగతి వారికి భారీ ఉపశమనం. స్వీట్లు,చాక్లెట్లు, ఐస్ క్రీమ్స్ మీద కూడా పన్ను ఐదు శాతానికి తగ్గనుంది. వ్యవసాయ రంగానికి సంబంధించి ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్ల పై జీఎస్టి 15% నుండి ఐదు శాతానికి తగ్గించారు.

చేనేత, హస్త కళాకారులకు ప్రయోజనం

ఇక ఏపీలోప్రత్యేకంగా జీఎస్టీ తగ్గింపుతో చాలా రంగాలకు ఉపయోగం ఉంది. ముఖ్యంగా చేనేత, హస్తకళలకు సంబంధించి జీఎస్టీ తగ్గింపుతో చాలా రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. మన రాష్ట్రంలో చేనేత రంగానికి సంబంధించి పొందూరు ఖాది, ధర్మవరం, పోచంపల్లి, మంగళగిరి చేనేత వృత్తుల వారికి.. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం అధికంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎగుమతులు పెరిగేందుకు అవకాశం లభించనుంది. సేవ రంగం, హొటల్ వసతులపై జీఎస్టి తగ్గింపు వల్ల.. హొటల్ చార్జీలు కూడా తగ్గుతాయి. ఫలితంగా విశాఖ లాంటి పర్యాటక నగరంలో సామాన్యుడికి సైతం షెల్టర్ దక్కి అవకాశం ఉంది. ప్రజారోగ్యానికి సంబంధించి మందులు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం లపై కూడా జీఎస్టీని తగ్గించడం మంచి నిర్ణయం. ఇది రాష్ట్రానికి ఎంతో మేలు జరిగేలా ఉందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

## బంగ్లాలో సీక్రెట్ మిషన్..! రంగంలోకి యూఎస్ ఆర్మీ..




వాషింగ్టన్: సరిగ్గా వారం రోజుల క్రితం.. బంగ్లాదేశ్‌లో యూఎస్ ఆర్మీ దిగింది. అమెరికాతో కలిసి.. బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వం ఏం ప్లాన్ చేస్తోంది? అసలు.. బంగ్లాదేశ్‌లో.. యూఎస్ ఆర్మీ చేపట్టిన సీక్రెట్ మిషన్ ఏంటి? వారి టార్గెట్ ఏంటి? రిపోర్టులు ఏం చెబుతున్నాయ్?

బంగ్లాదేశ్‌లో దిగిన యూఎస్ ఆర్మీ అధికారులు

ఆసియాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా సైన్యం.. బంగ్లాదేశ్‌లో దిగింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా పతనం తర్వాత.. బంగ్లాదేశ్, అమెరికా మధ్య సైనిక సంబంధాలు పెరిగాయి. ఎంతలా అంటే.. బంగ్లాదేశ్ సైన్యంతో.. యూఎస్ ఆర్మీ, యూఎస్ ఎయిర్‌ఫోర్స్ ఏకంగా జాయింట్ మిలటరీ విన్యాసాలు నిర్వహించే దాకా వచ్చాయ్ పరిస్థితులు.

అమెరికా సైన్యం కొత్త పేర్లతో రూమ్స్ బుక్..

యూఎస్ ఆర్మీ, యూఎస్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన దాదాపు 120 మంది అధికారులు.. ఈ నెల 10న.. అమెరికా-బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ విమానంలో.. ఢాకా నుంచి చిట్టగాంగ్‌లో దిగారు. అక్కడున్న రాడిసన్ బ్లూ హొటల్‌లో చెక్ ఇన్ చేశారు. యూఎస్ సైనిక సిబ్బంది కోసం హొటల్ 85 గదులు బుక్ చేసినట్లు రిపోర్టులు చెబుతున్నాయ్. ఇక్కడ ఇంట్రెస్టింగ్ పాయింట్ ఏమిటంటే.. వారి పేర్లు హొటల్ గెస్ట్ రిజిస్టర్‌లో నమోదు చేయలేదు.

బంగ్లాదేశ్ సైన్యానికి అమెరికా మద్దతిస్తోందా?

బంగ్లాదేశ్ సైన్యంతో.. ఉమ్మడి సైనిక విన్యాసాల్లో పాల్గొనేందుకు.. అమెరికా సైనిక అధికారులు వచ్చారు. వీళ్లంతా.. ఈ నెల 20న తిరిగి యూఎస్‌కు వెళ్లే అవకాశం ఉంది. అయితే.. ఏప్రిల్‌లో యూఎస్ స్పెషల్ ఫోర్సెస్ కమాండ్ ఆఫీసర్ అర్వెల్లె జాక్సన్.. బంగ్లాదేశ్ వచ్చారు. అతను.. ఆగస్ట్ 31న ఢాకాలోని వెస్టిన్ హొటల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత.. యూఎస్ ఆర్మీ సైనికాధికారులు బంగ్లాదేశ్ వచ్చారు. కానీ.. అతని మరణం అనుమానాస్పద స్థితిలో ఉన్నా.. బంగ్లాదేశ్ గానీ, అమెరికా గానీ దీనిపై బహిరంగంగా స్పందించలేదు.

అమెరికా దళాలు బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన పటేంగా ఎయిర్‌బేస్‌ని సందర్శించారు..

సెప్టెంబర్ 14న.. ఈజిప్ట్ ఎయిర్ ఫోర్స్ కార్గో విమానం.. చిట్టగాంగ్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. ఆ తర్వాతి రోజు.. అమెరికా దళాలు బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన పటేంగా ఎయిర్‌బేస్‌ని సందర్శించాయ్. గతంలో.. బంగ్లాదేశ్ సైన్యంతో కలిసి టైగర్ లైట్నింగ్, ఆపరేషన్ లైట్నింగ్ అనే రెండు ఉమ్మడి విన్యాసాల్లో.. అమెరికా దళాలు పాల్గొన్నాయి.

అమెరికా-బంగ్లా మధ్య వ్యూహాత్మక సంబంధాలున్నాయా?

ఇవి.. శాంతి పరిరక్షక సంసిద్ధతని పెంచేందుకు,రెండు దేశాల సాయుధ దళాల మధ్య పరస్పర సామర్థ్యాన్ని ప్రోత్సహించేందుకు డిజైన్ చేశారు. ఈ విన్యాసాలు.. ప్రాంతీయ భద్రతని బలోపేతం చేసేందుకు, బంగ్లాదేశ్ సైన్యానికి అమెరికా మద్దతు ఇవ్వగల ప్రాంతాలని అన్వేషించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. షేక్ హసీనా పతనం తర్వాత..బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వం,ట్రంప్ గవర్నమెంట్ మధ్య సైనిక,వ్యూహాత్మక సంబంధాలు తీవ్రమయ్యాయి.

## పదేళ్ల బీజేపీ పాలనలో ఐఆర్‌ఎస్‌ల వీఆర్‌ఎస్

హైదరాబాద్,దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇండియన్ రెవెన్యూ సర్వీసు (ఐఆర్ఎస్) అధికారులు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారు. పదేళ్ళ బీజేపీ పాలనలో సుమారు 853 మంది ఐఆర్ఎస్ అధికారులు వీఆర్ఎస్ తీసుకోవడం సంచలనం రేపుతోంది. కొందరు పని ఒత్తిడి, మరికొందరు పన్ను లక్ష్యాలు సాధించలేక తప్పుకుంటుండగా, మిగతావాళ్లు అవినీతి సొమ్మును కాపాడుకునేందుకు బయటకు వస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఐఏఎస్, ఐపీఎస్‌ల కన్నా ఎక్కువగా ఐఆర్ఎస్‌లే వీఆర్ఎస్ తీసుకుని బయటకు వస్తుండటం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఐఏఎస్ ఉంటారు. ఈ పోస్టులో ఐఆర్ఎస్ అధికారిని నియమించాలని కొన్నేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం కూడా కారణంగా చెబుతున్నారు. ఇలా బయటకు వచ్చిన వాళ్లలో సమర్థత ఉన్నవాళ్లు కార్పొరేట్ కంపెనీల్లో చేరి కొత్త శిఖరాలు అధిరోహిస్తున్నారు. మరికొందరు ట్యాక్స్ ప్రొఫెషనల్స్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. వీరిలో రెగ్యులర్ రిక్రూటీ, ప్రమోటీ అధికారులు ఉన్నారు.

పట్టణ ప్రాంతాల్లోనే విధులు

సాధారణంగా ఐఆర్ఎస్‌కు ఎంపికైన వారు ఇన్‌కం ట్యాక్స్‌తోపాటు కస్టమ్స్ లో పనిచేయవచ్చు. నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఈడీ, మంత్రుల కార్యాలయాల్లో డిప్యూటేషన్‌పై పనిచేసుకునే వెసులుబాటు కూడా ఉంది. వీరు సర్వీసులో చేరిన దగ్గర నుంచి ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే విధులు నిర్వర్తిస్తారు. పట్టణ ప్రాంతాలు, పోర్టు, ఎయిర్ పోర్టులలో ఎక్కువగా పనిచేస్తారు. రాజీనామాలు, వీఆర్ఎస్ కు ప్రధాన కారణాలు ఆదాయపు పన్ను లక్ష్యాలను సాధించలేకపోవడం అంటున్నారు. దీంతోపై అధికారుల నుంచి ఒత్తిడి ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖలో ఎప్పుడు కూడా నిర్దేశించుకున్న లక్ష్యాలలో యాభై శాతం ఎప్పుడు కూడా దాటిన సందర్భాలు లేవంటున్నారు. కస్టమ్స్ విభాగంలో పనిచేసే వారు కంపెనీల కేసుల్లో స్వయంగా వాదనలు విన్పించాల్సి ఉంటుంది. వాదనలలో ఏమాత్రం తప్పులు జరిగినా ప్రభుత్వానికి కోట్ల రూపాయల్లో నష్టం వస్తుంది. ఎనిమిది సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమల్లోకి తెచ్చిన తరువాత కార్పొరేట్ కంపెనీల్లో గందరగోళం నెలకొంది. కొత్త చట్టం పట్ల అవగాహన లేక అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారు. ట్యాక్స్ కన్సల్టెంట్లు ఉన్నప్పటికీ, ఆటోమేటెడ్ విధానంపై అవగాహన రావడానికి మూడు నాలుగు సంవత్సరాలు పట్టింది. ప్రభుత్వంలో వేధింపులు, కార్పొరేట్ కంపెనీల నుంచి ఆఫర్లు రావడం వంటి కారణాల మూలంగా పలువురు స్వచ్ఛందంగా తప్పుకున్నారని అధికవర్గాలు చెబుతున్నాయి. చాలా మంది కార్పొరేట్ కంపెనీల్లో జీఎస్టీ కన్సల్టెంట్లుగా చేరి, మూడింతలకు పైగా జీతాన్ని పొందుతున్నారని అంటున్నారు. మరికొందరు ట్యాక్స్ కన్సల్టెంట్లుగా కార్యాలయాలు తెరుచుకుని సాఫీగా జీవనం సాగిస్తున్నారు. పదేళ్ల వ్యవధిలో ఆదాయపు పన్ను (ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్)లో పనిచేసే వారు 383 మంది, పరోక్ష పన్నులు (ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్) లో పనిచేసే వారు 470 మంది వరకు వీఆర్ఎస్ తీసుకున్నారని తెలుస్తున్నది.

సీఆర్ఎస్ కూడా

నరేంద్ర మోదీ ప్రభుత్వం బలవంతపు పదవీ విరమణ (సీఆర్ఎస్)ను గట్టిగా




అమలు చేస్తున్నది. 2019 సంవత్సరంలో అవినీతి ఆరోపణలు, లైంగిక వేధింపులు, మోసాలకు పాల్పడిన 12 మంది ఐఆర్ఎస్ అధికారులను తొలగిస్తూ అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదేశాలు జారీ చేశారు. వీరిలో ఐటీ చీఫ్ కమిషనర్లు, కమిషనర్లు ఉన్నారు. ఇదే సంవత్సరం జూన్ నుంచి ఆగస్టు వరకు 39 మంది ఐఆర్ఎస్ అధికారులకు సీఆర్ఎస్ ఇవ్వడం ఐటీ శాఖలో సంచలనం రేపింది. వీరిలో ఒక అధికారి సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఎలాంటి ఉపశమనం లభించలేదు. గతంలో కేఫ్ కాఫీ డే యజమాని విజీ సిద్ధార్థ ఆత్మహత్యకు పాల్పడటం వెనుక ఐటీ అధికారుల వేధింపులే కారణమన్న ఆరోపణలు వచ్చాయి.

122 మంది ఐఏఎస్‌లూ సీఆర్ఎస్

దేశంలో 2020 నుంచి 2023 వరకు 122 మంది ఐఏఎస్ అధికారులకు బలవంతపు పదవీ విరమణ (సీఆర్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. సమర్థవంతంగా పనిచేయకపోవడం, బంధుప్రీతి, అవినీతికి పాల్పడం, విజిలెన్స్ కేసులు వంటి కారణాలతో ప్రభుత్వమే సీఆర్ఎస్ అమలు చేస్తోంది. 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలో న్యూఢిల్లీలో ఒక ఐఏఎస్ అధికారిణి రింకూ దుగ్గా (ఏజీఎంయూటీ 1994 బ్యాచ్) తన కుక్కల వాకింగ్ కోసం స్టేడియంలో ప్రాక్టీస్‌కు వచ్చే క్రీడాకారులను నిలిపివేసింది. ఇది కొన్ని నెలల పాటు జరగడం, మీడియాలో వార్త రావడంతో ఆమెకు సీఆర్ఎస్ ఇచ్చేసి ఇంటికి పంపించారు. 2007 నుంచి 2012 వరకు 44 మంది ఐఏఎస్‌లు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 2022లో ముగ్గురు, 2023లో ఐదుగురు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. వీరిలో కొందరు రాజకీయాలకు వెళ్లగా, మరికొందరు విదేశాలకు వెళ్లి కార్పొరేట్ కంపెనీల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొందరు అనారోగ్యం కారణం చూపుతూ స్వంత వ్యాపారాలను ప్రారంభించారు.

మూడు నెలల ముందు నోటీసు

నూతన నిబంధనల ప్రకారం ప్రభుత్వ సర్వీసులో కనీసం ఇరవై సంవత్సరాలు పూర్తి చేసిన వారే స్వచ్ఛంద పదవీ విరమణకు అర్హులు. మూడు నెలల ముందే తమ అధికారికి వీఆర్ఎస్ దరఖాస్తు అందచేయాలి. ఇరవై సంవత్సరాల సర్వీసు పూర్తి కానట్లయితే రాజీనామా సమర్పించాలి. వీఆర్ఎస్ పొందిన వారికి పెన్షన్ సౌకర్యంతో పాటు, కుటుంబ సభ్యులకు సీజీహెచ్ఎస్ ఇస్తారు. ఒక వేళ వీఆర్ఎస్ వద్దనుకుంటే మూడు నెలల వ్యవధిలో దరఖాస్తును వెనక్కి తీసుకునేందుకు అవకాశం కూడా ఉంది.

## మేమే ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నాం:రేఖా గుప్తా

న్యూఢిల్లీ,ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతున్న సమయంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. "70 ఏళ్లుగా కాంగ్రెస్ ఈవీఎంలను హ్యాక్ చేస్తోంది. అప్పుడు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు మేము చేస్తే తప్పా?" అనే తర్జన-భర్జనతో చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా స్పందనకు కారణమయ్యాయి.

వివాదాస్పద ఇంటర్వ్యూ

ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విలేఖరి ఆమెను ప్రశ్నించాడు "రాహుల్ గాంధీ మిమ్మల్ని ఈవీఎంల హ్యాకింగ్‌లో ఆరోపిస్తున్నారు కదా?" అన్న ప్రశ్నకు స్పందిస్తూ, రేఖా గుప్తా కోపంగా "కాంగ్రెస్ గెలిస్తే ప్రజా తీర్పు, మేము గెలిస్తే హ్యాకింగ్ అనుకుంటారా?" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

"ఈ ద్వంద్వ ధోరణి ఏ పుస్తకంలో ఉంది?" రేఖా ప్రశ్న


ఈ సందర్భంగా రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ, "ఈ డబుల్ స్టాండర్డ్‌కు వ్యాఖ్యం ఇవ్వగలవా? దేశ ప్రజలను గందరగోళపర్చడమే మీకు తెలుసు" అంటూ రేఖా గుప్తా వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కేజ్రీవాల్ షేర్ చేసిన వీడియో వైరల్



ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన 13 సెకన్ల క్లిప్‌ను తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. "ఢిల్లీ సీఎం ఏం చెబుతున్నారో వినండి" అంటూ ట్వీట్ చేయడంతో ఆ క్లిప్ సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అయింది. అయితే, ఆ వీడియో కత్తిరించబడినదని, అసలు ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా జరిగిన సంభాషణను కాస్త వక్రీకరించారనే ఆరోపణలు వచ్చాయి. ఫ్యాక్ట్ చెక్ వెబ్‌సైట్లు అసలు 1.5 నిమిషాల వీడియోను బయటపెట్టగా, అందులోనూ రేఖా గుప్తా అదే వ్యాఖ్య చేసినట్లు కనిపించింది.

## హైదరాబాద్‌లో మాత్రమే పెరుగుతున్న ఇళ్ల విక్రయాలు !



హైదరాబాద్,దేశంలోని ప్రధాన 9 నగరాల్లో ఇళ్ల విక్రయాలు 4 శాతం తగ్గినప్పటికీ, హైదరాబాద్ మార్కెట్ మాత్రం గణనీయమైన రికవరీ చూపిస్తోంది. NSE-లిస్టెడ్ రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ ఫర్మ్ ప్రాప్‌ఈక్విటీ ( విడుదల చేసిన తాజా రిపోర్ట్ ప్రకారం, జులై-సెప్టెంబర్ 2025 క్వార్టర్‌లో (Q3 2025) హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాలు గత సంవత్సరం అదే కాలంతో పోలిస్తే 4 శాతం పెరిగి 12,860 యూనిట్లకు చేరాయి. దేశవ్యాప్తంగా అమ్మకాలు తగ్గితే హైదరాబాద్‌లో పెరుగుతున్నాయి.హైదరాబాద్ వంటి నగరాల్లో IT సెక్టార్, మెట్రో ఎక్స్‌పాన్షన్ వంటి అంశాలు డిమాండ్‌ను పెంచుతున్నాయని ప్రాప్ ఈక్విటీ అంచనా వేసింది. హైదరాబాద్‌లోని వెస్ట్ రీజియన్ లో గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ప్రాంతాలు లో హై-ఎండ్ ఇళ్లపై డిమాండ్ పెరగడంతో పాటు మధ్య-స్థాయి ఫ్యామిలీలకు అనుకూలమైన రేట్లను రియల్టర్లు గుర్తించారని అంటున్నారు. రిపోర్ట్ ప్రకారం, గత క్వార్టర్‌తో పోలిస్తే కూడా హైదరాబాద్ విక్రయాలు 14 శాతం పెరిగాయి. ఇదే సమయంలో ముంబై, పూణే వంటి నగరాల్లో 10-15 శాతం తగ్గుదల నమోదు అయింది.హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో మాత్రమే పెరుగుదల నమోదు అయింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ 2025-26లో మరింత బలపడి, 10-20 శాతం ధర పెరుగుదల చూపిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ పెరుగుదల, హైదరాబాద్‌ను దక్షిణ భారత రియల్ ఎస్టేట్ హబ్‌గా మార్చుతోందనే ఆశాభావాన్ని రేకెత్తిస్తోంది.

## రాజకీయ సభలకు వచ్చే వారందరూ ఓట్లేస్తారా?



హైదరాబాద్,రాజకీయ సభలకు వచ్చే వారందరూ ఓట్లేస్తారా .. ఈ ప్రశ్న ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. టీవీకే అధ్యక్షుడు విజయ్ సభకు జనం బాగా వస్తున్నారు. అయితే రాజకీయాలపై కనీస అవగాహన ఉన్న వారికి .. అలా వచ్చే ప్రజలు అంతా ఓట్లు వేయరని అంటున్నారు. ఇదే విషయాన్ని విజయ్ ఓ సభలో ప్రస్తావించారు. మీరంతా ఓట్లు వేయరని అంటున్నారు.. నిజమేనా అని అడిగారు. దానికి వారంతా వేస్తామని చెప్పారు. దీనిపై అనేక మంది అనేక రకాల అభిప్రాయాలు చెప్పారు.కమల్ హాసన్ కూడా అలా వచ్చే వారు అంతా ఓట్లు వేయరని ఇది ఇది అందరికీ వర్తిస్తుందన్నారు. సినిమా వాళ్ల సభలకు వచ్చే జనాలను అసలు ఓటర్లుగా పరిగణించడానికి కూడా రాజకీయవర్గాలు అంగీకరించవు. విజయ్ సూపర్ స్టార్. ఆయన ఇంకా సినిమాలు చేస్తూనే ఉన్నారు. తమిళనాట సినీ స్టార్లకు ఉండే ఆదరణ గురించి చెప్పాల్సిన పని లేదు. ఆయనను చూసేందుకు పెద్దఎత్తున జనం రావడంలో వింత లేదు.. విచిత్రం కూడా కూడా.రాజకీయంగా అది బలం కూడా కాదనేది ఎక్కువ మంది అభిప్రాయం.కానీ ఇలా వచ్చే జనం ఆయనపై ఓ పాజిటివ్ బజ్ ను తీసుకు వస్తుంది .కానీ ఓట్లు తీసుకు రావు. రాజకీయ సమీకరణాలను కేవలం అభిమానంతో అంచనా వేయడం అసాధ్యం. సినీ అభిమానంతో ఓట్లు వేసే వారిలో కొంత మంది యువత మాత్రమే ఉంటారు. ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలనుకున్నవారు ఖచ్చితంగా సినీ హీరో ఉన్న నేపథ్యం మాత్రమే చూడరు. విజయ్ కు వచ్చే జనం ఆర్గానిక్ కావొచ్చు కానీ..అది సినీ క్రేజ్ మాత్రమే అవుతుంది. దాన్ని ఓట్లుగా మల్చుకోవాలంటే.. విజయ్ ఇంకా చాలా కసరత్తు చేయాల్సి ఉంటుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com